**విలేకరులు కావలెను**

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189



# మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET
MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 218 | volume: 1, Issue: 218 | శనివారం 07 మార్చి 2026 పేజీలు : 8 వెల : 3.00


## సీఎం కు కిషన్ రెడ్డి బహిరంగ లేఖ



**-భూసేకరణ ఆలస్యంతో పనులు నిలిచిపోయాయని వ్యాఖ్యలు...**
**-ప్రయాణికులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన...**
**-సర్వీస్ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి...**

**హైదరాబాద్:** అంబర్‌పేట్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఫ్లైఓవర్ ప్రారంభమై దాదాపు సంవత్సరం కావొస్తున్నప్పటికీ సర్వీస్ రోడ్ నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. రూ. 265 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఫ్లైఓవర్ నిర్మించిందని కిషన్ రెడ్డి తెలిపారు. అయితే భూసేకరణలో ఆలస్యం కారణంగా సర్వీస్ రోడ్ పూర్తి స్థాయిలో నిర్మాణం కాలేదని చెప్పారు. ఈ విషయాన్ని గతంలోనే కేంద్ర రహదారి రవాణా మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. భూసేకరణ కోసం ఇప్పటికే రూ. 2.54 కోట్ల పరిహారం చెల్లించినప్పటికీ మధ్యవర్తుల అడ్డంకులు మరియు ఇతర కారణాలతో పనులు ముందుకు సాగడం లేదని ఆయన ఆరోపించారు. అభివృద్ధి పనుల్లో ఉన్న అడ్డంకులను తొలగించి ప్రజలకు సౌకర్యం కల్పించేలా అంబర్‌పేట్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్ నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కిషన్ రెడ్డి తన లేఖలో కోరారు.

## ఆరు నెలల క్రితమే నిర్ణయం

### అలీ ఖమేనీని లక్ష్యంగా ముందుగానే ప్రణాళిక



**డెస్క్:** ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ ముందుగానే ప్రణాళిక రూపొందించినట్లు ఆ దేశ రక్షణ మంత్రి కాట్జ్ వెల్లడించారు. ఖమేనీని అంతమొందించాలనే నిర్ణయం సుమారు ఆరు నెలల క్రితమే తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరం నవంబర్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కాట్జ్ మాట్లాడుతూ, గత సంవత్సరం చివరలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ నేతృత్వంలో ఉన్నతస్థాయి భద్రతా సమావేశం నిర్వహించామని చెప్పారు. ఆ సమావేశంలోనే ఖమేనీని తొలగించాలనే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం దేశ భద్రత దృష్ట్యా తీసుకున్నదని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌పై ప్రస్తుతం జరుగుతున్న సైనిక చర్య వాస్తవానికి 2026 సంవత్సరం మధ్యలో ప్రారంభం కావాల్సి ఉందని ఆయన తెలిపారు. అయితే ఆ సమయంలో తమ ప్రణాళిక గురించి అమెరికాకు తెలియజేయలేదని కాట్జ్ చెప్పారు. పరిస్థితుల మార్పు కారణంగా చర్యలను ముందుగానే చేపట్టాల్సి వచ్చిందని వివరించారు. గత నెలలో ఇరాన్‌లో ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ మధ్య చర్చలు జరిగాయని కాట్జ్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే ముందుగా ప్రణాళిక చేసిన ఆపరేషన్‌ను త్వరగా అమలు చేసినట్లు ఆయన వెల్లడించారు.

## 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం




**డెస్క్:** ఇటీవలి కాలంలో సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగిపోవడంతో చిన్నారులపై ప్రతికూల ప్రభావం పడుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 16 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కర్ణాటక అసెంబ్లీలో 2026‑27 వార్షిక బడ్జెట్ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ విషయాన్ని వెల్లడించారు. చిన్నారుల్లో మితిమీరిన స్మార్ట్‌ఫోన్ వినియోగం వల్ల అనేక రకాల మానసిక మరియు శారీరక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో తీవ్రమైన ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. పిల్లలపై సోషల్ మీడియా ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం తెలిపింది. చిన్న వయస్సులోనే డిజిటల్ వ్యసనం పెరగడం వల్ల చదువుపై దృష్టి తగ్గడం, నిద్రలేమి, ఒత్తిడి వంటి సమస్యలు పెరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. అందుకే 16 సంవత్సరాల లోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగాన్ని పరిమితం చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మైనర్లకు సోషల్ మీడియా వినియోగంపై నియంత్రణలు అమలులో ఉన్నాయి. అయితే భారతదేశంలో 16 సంవత్సరాల లోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించిన తొలి రాష్ట్రంగా కర్ణాటక నిలిచింది. ఈ నిర్ణయం ఇతర రాష్ట్రాలకు కూడా మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

### 99 రోజుల కార్యక్రమం ప్రారంభం



**హైదరాబాద్:** హైదరాబాద్ నగర అభివృద్ధి మరియు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' పేరుతో 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాసాబ్‌ట్యాంక్‌లోని చాచా నెహ్రూ పార్క్‌లో జరిగిన కార్యక్రమంలో నగర ఇన్‌చార్జి, మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు మంత్రి చాచా నెహ్రూ పార్క్‌లో ఉన్న దేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం నగర అభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సురక్షితంగా నిర్వహించేందుకు ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే పుస్తక పఠనాన్ని ప్రోత్సహించేందుకు హైదరాబాద్‌లో తొలి మిర్రర్ లైబ్రరీను కూడా ప్రారంభించారు. మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో 'ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్'ను ప్రారంభించారు. అదేవిధంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలుగా సుమారు రూ. 35 కోట్ల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమం సందర్భంగా మహిళా సంఘాల సభ్యులతో మంత్రి ముచ్చటించి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్న ఈ 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం ద్వారా గ్రామాలు, వార్డులు, మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం, మహిళా సాధికారతను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యాలుగా ఉన్నాయని పేర్కొన్నారు.

## అమెరికా 'డూమ్స్‌డే' క్షిపణి పరీక్ష



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో అమెరికా కీలక క్షిపణి పరీక్షను నిర్వహించింది. అత్యంత శక్తివంతమైన ఖండాంతర అణు క్షిపణి మినిట్‌మ్యాన్-3ను కాలిఫోర్నియా తీర ప్రాంతంలో అమెరికా పరీక్షించింది. 'డూమ్స్‌డే' క్షిపణిగా పిలిచే ఈ మిసైల్ నిర్దేశించిన లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. మినిట్‌మ్యాన్-3 క్షిపణిలో అత్యంత శక్తివంతమైన మార్క్-21 రీఎంట్రీ వాహనం అమర్చబడి ఉంటుంది. దీనిలో అణు పేలోడ్‌ను అమర్చే సామర్థ్యం ఉంది. ఈ క్షిపణి 1945లో జపాన్‌లోని హిరోషిమాపై ప్రయోగించిన అణుబాంబు కంటే దాదాపు 20 రెట్లు ఎక్కువ శక్తివంతమైన అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదని సమాచారం. ఈ ఖండాంతర క్షిపణి గంటకు సుమారు 15 వేల మైళ్ల వేగంతో ప్రయాణించగలదు. దాదాపు 6 వేల మైళ్ల దూరం వరకు లక్ష్యాన్ని చేరుకునే సామర్థ్యం దీనికి ఉంది. అంటే ప్రయోగించిన తర్వాత కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే లక్ష్యాన్ని ఛేదించగలదు. గత ఏడాది నవంబర్‌లో కూడా ఈ క్షిపణిని అమెరికా పరీక్షించింది. అయితే ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో మరోసారి ఈ పరీక్ష నిర్వహించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. అమెరికా రక్షణ సామర్థ్యాన్ని బలపరచడమే ఈ పరీక్షల ఉద్దేశమని అధికారులు తెలిపారు.

## పరీక్షకు వెళ్లిన అక్కాతమ్ముళ్లను బాబాయ్ హత్య



**డెస్క్:** చేతిలో హాల్‌టిక్కెట్లు పట్టుకుని పరీక్షా కేంద్రానికి బయలుదేరిన అక్కాతమ్ముళ్లను వారి సొంత బాబాయ్ హత్య చేసిన ఘటన మధ్యప్రదేశ్‌లో కలకలం రేపింది. సీహోర్ జిల్లాలోని ధరమ్‌పురి గ్రామంలో ఈ దారుణం చోటుచేసుకుంది. కుటుంబ ఆస్తి వివాదాల నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ధరమ్‌పురి గ్రామానికి చెందిన శీతల్ (20), కుల్దీప్ (18) శుక్రవారం ఉదయం తమ బోర్డు పరీక్షలకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి బయలుదేరారు. అయితే ఇంటి నుంచి కొద్దిదూరం వెళ్లగానే దారిలో పొంచి ఉన్న వారి బాబాయ్ హరిసింగ్ మాలవీయ కర్రతో దాడి చేశాడు. విచక్షణారహితంగా దాడి చేయడంతో ఇద్దరూ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు సమాచారం. పరీక్షలకు వెళ్లిన పిల్లలు రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉండటం చూసి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వారి చేతిలో ఉన్న హాల్‌టిక్కెట్లు రక్తంతో తడిసిపోవడం గ్రామస్తులను కలచివేసింది. పిల్లలు చదువుకుని కుటుంబానికి వెలుగునిస్తారని ఆశించిన తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. కుటుంబ ఆస్తి తగాదాలే ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దారుణానికి పాల్పడిన హరిసింగ్‌పై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జంట హత్యలతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. హత్య అనంతరం పరారైన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## అంబేద్కర్ చైతన్య యూత్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది




**ఎల్లారెడ్డిపేట మార్చి:06 (మన వార్తా ప్రతినిధి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి లోని ఈరోజు అంబేద్కర్ చైతన్య యూత్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గమును ఎన్నుకోవడం జరిగినది అధ్యక్షుడు గా దాసరి దేవచంద్రం,ఉప అధ్యక్షుడు,కూడెల్లి శంకర్,ప్రధాన కార్యదర్శిఅందె సురేష్,కోశాదికారిదాసరి బాబు,కార్యవర్గసభ్యులు అందె దేవరాజు,అందె గణేష్, లను ఎన్నుకోవడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో రాచర్ల గొల్లపల్లి గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ నూతన కార్యవర్గానికి శాలువా కప్పి సన్మానించడం జరిగినది,ఇట్టి కార్యక్రమంలో కొండ రమేష్ గౌడ్ మాట్లాడుతూ అంబేద్కర్ చైతన్య యూత్ ఆధ్వర్యంలో కాలనీలోని ప్రైమరీ స్కూల్ వద్ద వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి తాను కృషి చేస్తానని ఇలా అన్నాడు అదేవిధంగా నూతన కార్యవర్గం ఎన్నుకోబడినటువంటి సభ్యులకు తాను ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు

## దుమాల అక్కపెల్లి బుగ్గ తండా మీదుగా మరిమడ్లకు బస్సు ప్రారంభం



**ఎల్లారెడ్డి పేట మార్చి :06 (మన వార్తా ప్రతినిధి)**ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామం మీదగా అక్కపెల్లి బుగ్గ రాజేశ్వర తండా గ్రామాల మీదుగా మరిమడ్ల వరకు సిరిసిల్ల టిజిఎస్ ఆర్టీసి బస్సు ను శుక్రవారం ప్రారంభించారు, ప్రతిరోజు సిరిసిల్ల ఆర్టీసీ డిపో నుండి ఉదయం 6:00 గంటలకు బయలు దేరుతుందని మరిమడ్ల కు ఉదయం 8:00 గంటలకు చేరుకుంటుందని అక్కడినుండి మళ్లీ తిరుగు ప్రయాణమై సిరిసిల్ల పాత బస్టాండ్ కు సాయంత్రం 4:30 గంటలకు చేరుకుంటుందని మళ్లి 4:30 గంటలకు బయలుదేరి దుమాల అక్క పెల్లి బుగ్గ తండా మీదుగా మరిమడ్లకు చేరుకుంటుందని మరిమడ్ల నుండి తిరిగి డిపోకు రాత్రి చేరుకుంటుందని సిరిసిల్ల డిపో ఎస్టిఐ వర్జ్యా నాయక్ తెలిపారు,మా గ్రామానికి బస్సు రావడం చాలా సంతోషంగా ఉందని బస్సు రావడానికి కృషి చేసిన రోడ్డు రవాణా శాఖ బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ కు , సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డికి సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు, ఈ సందర్భంగా అర్టీసి బస్సు కు గోబ్బరి ఆకుల తో రంగు రంగు పూల తో అలంకరించి టెంకాయలు కొట్టి బస్సు ను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు సోమారపు శరవిందు, మాదాసు స్రవంతి బాబు , అజ్మీర తిరుపతి నాయక్ ,ఉప సర్పంచ్ లు గుర్రం విశాల్ , మందాటి బాబు యాదవ్, లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంజిరెడ్డి పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గోగురి ప్రదీప్ రెడ్డి , రవీందర్ రెడ్డి భూమిరెడ్డి, మందాటి దేవేందర్ యాదవ్, మొగుళ్ళ మధు యాదవ్, కర్రోళ్ల రాజు,మొగుళ్ళ గోపాల్, బట్టు రాజు, నిమ్మల చందు,రామిళ్ళ బాబు,గుర్రపు సాయి, కోరుకుంట్ల దావీద్, దండు లక్ష్మీనారాయణ, జంపల్లి నరేష్,లు ప్రారంబోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు,

## టెన్త్ విద్యార్థులకు కేటీఆర్ కానుక



**ఎల్లారెడ్డిపేట మార్చి: 06 (మన వార్తా ప్రతినిధి)**ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలోని జెడ్.పి. హెచ్.ఎస్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 33 మంది విద్యార్థులకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహకారంతో ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, ఉప సర్పంచ్ పొన్నాల మనమ్మ శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ సభ్యులు గొర్రె మల్లేష్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు అందె సురేష్, కొండ ఆంజనేయులు, ఆకుల మురళి, పాటి దేవయ్య, పెంజర్ల శ్రీనివాస్, దొంత మనోహర్ మరియు పాఠశాల హెడ్మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## మాజీ జెడ్పిటిసి వద్నాల నరసయ్య, మనవరాలు వివాహానికి హాజరైన టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట నాగయ్య



**ఎల్లారెడ్డిపేట మార్చి:06 (మన వార్తా ప్రతినిధి)**ఎల్లారెడ్డిపేట మండలం మాజీ జడ్పిటిసి మన వారాలి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన రాజన్న సిరిసిల్ల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట ఆగయ్య,సెస్ డైరెక్టర్ వరుస కృష్ణ హరి,సర్పంచ్ ఎడగందుల నరసింహులు,మాజీ ప్యాక్స్ చైర్మన్ కృష్ణరెడ్డి,సిరిసిల్ల శాసనసభ్యులు కేటీఆర్, పి ఏ దన్ రాజు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పందిళ్ల పరుశరాములు, రమేష్, బాల్ రెడ్డి, మురళి, మరియు వీరితోపాటు తదితరులు పాల్గొన్నారు

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయండి...



**–ఎంపీడీవో దామోదర్....**

**చిన్న శంకరంపేట మార్చి 6 ( మన వార్త ప్రతినిధి)** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం లో చెత్తను తొలగించి తగలబెట్టారు, పనికిరాని ఫైలు తొలగించడం, బూజు తొలగించడం, వంటి కార్యక్రమాలను చేపట్టారు, ఈ సందర్భంగా ఎంపీడీవో దామోదర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నేటి నుండి 15వ తేదీ వరకు పంచాయతీరాజ్ కు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని పెండింగ్లో ఉన్న ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాలను తప్పకుండా నెరవేర్చాలని పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులు 99 రోజుల ప్రణాళికలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు, 99 రోజులపాటు నిర్వహించే ప్రణాళికలో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని, సంబంధిత అధికారులు అందరూ కూడా కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

## ఆలయ అభివృద్ధి కొరకు మరియు ఉత్సవాలకు 30 వేలు విరాళంగా ఇచ్చిన భక్తులు




**నిజామాబాద్ జిల్లా సిరికొండ( మన వార్త) మార్చి 6** సిరికొండ మండల కేంద్రంలో గల గ్రామ కొండపై ఉన్న శ్రీ శేషసాయి లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో జరగబోయే కార్యక్రమాల నిర్వహణ కోసం భక్తులు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి మరియు ఉత్సవాల నిర్వహణకు సుమారు రూ.30,వేలు విరాళంగా సమర్పించారు. దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి భక్తుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. గ్రామస్థులు, భక్తులు కలిసి దేవాలయ అభివృద్ధికి ముందుకు రావడం ఆనందకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బైరి నాగేశ్వర్, ఉపాధ్యక్షులు మాడ గంగాధర్, కోశాధికారి మాడ లక్ష్మీనారాయణ, సభ్యులు గండ్ల అవినాష్, బైరి నరేష్, మాడ ప్రసాద్, గురుడు గణేష్, ఎండి ఖాన్, శ్రీరంగ సత్యనారాయణ, న్యాలకంటి రాజేష్, ఎండి సలీం, గోపిశెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా దినోత్సవ వేడుకలు



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మార్చి 6మన వార్త :** అల్వాల్ ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర సిబ్బంది సభ్యులు కలిసి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల సేవా భావం, సమాజ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని మహిళల సాధికారత, ఆరోగ్య పరిరక్షణలో మహిళల పాత్ర గురించి చర్చించారు. ముఖ్యంగా వైద్య సేవల ద్వారా ప్రజలకు సేవ చేయడం తమ బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతి శ్రీనివాస్ గౌడ్, శారద, నర్సమ్మ, జయమ్మ, మాధవి, ఉషా, ఇంద్ర, ప్రేమ్రాజ్, వంశీ, ఖాదర్, మారుతి, సాయి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో సాగి మహిళా దినోత్సవానికి ప్రత్యేక గుర్తింపునిచ్చింది. ఇలాంటి కార్యక్రమాలు మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా సమాజంలో మహిళల స్థానం మరింత బలపడేలా చేస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి...



**చిన్న శంకరం పేట మార్చి 5( మన వార్త ప్రతినిధి)** చిన్న శంకరం పేట మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నేటి నుండి జూన్ 12వ తేదీ వరకు 99 రోజులపాటు నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి మండల సర్పంచులతో స్థానిక ఎంపీడీవో ఆధ్వర్యంలో ఐకెపి కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు, అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచులను తహశీల్దార్ మాలతి ఎంపీడీవో దామోదర్ తో పాటు వివిధ శాఖల అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుక అనుమతినిచ్చిన ఇక్కడి అధికారులు ఇసుక తీయనియడం లేదని ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం అనుమతి ఇస్తేనే పేదవారు ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటూ పేదోడి సొంతింటి కల నెరవేర్చుకునేందుకే ఇందిరమ్మ ఇండ్ల పథకం తీసుకువచ్చి పేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తే ఇక్కడి అధికారులు ఇసుక తీయనియడం లేదని జంగారాయి సర్పంచ్ జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు, తహసిల్దార్ మాలతి మాట్లాడుతూ ఇంటి నిర్మాణం కోసం ఇసుక కావాలన్నా మట్టిని తెచ్చుకోవాలన్న మైనింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరి అని గతంలో అనుమతులు ఇస్తే ఒక్క రోజును రెండు రోజులుగా పేపర్ పై దిద్ది ఇసుక తరలించడం జరిగిందని అందుకే ఇక్కడ అనుమతులు ఇవ్వడం లేదని ఆమె సూచించారు, చిన్న శంకరంపేట మండలంలో ఇసుక అందుబాటులో లేదని హల్దివాగునుండి ఇసుక తెచ్చుకోవాలంటే కోర్టు నుండి స్టే ఉన్నదని తహశీల్దార్ మాలతి తెలిపారు, పశు వైద్యాధికారి డాక్టర్ గీతా మాలిక మాట్లాడుతూ గ్రామాలలో గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు వ్యాక్సిన్ వేసేందుకు వచ్చిన రైతులు స్పందించడం లేదని పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్ వేయకపోతే పశువులు పాడవుతాయని దానితోపాటు గ్రామం అంతా కూడా ఈ వ్యాధి సోకి పశువులు మొత్తం పాడవుతాయి కాబట్టి రైతులు తప్పకుండా పశువులకు వ్యాక్సినేషన్ చేయించుకోవాలని ఆమె తెలిపారు, అదే విధంగా గ్రామాలలో కోళ్ల వ్యర్థపదార్థాలను రోడ్లపై వేయడం జరుగుతుందని దీని ద్వారా కుక్కలు గ్రామాలలో గుంపులు గుంపులుగా రావడం జరుగుతుందని చిన్నపిల్లలు ఎవరైనా బయట ఉంటే వారిని కరవడం జరుగుతుందని తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగ ఉంటూ చిన్న పిల్లలను బయట వదిలిపెట్టకూడదని ఆమె తెలిపారు,నెల రోజులపాటు గ్రామాల్లో వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని కుక్కల యజమానులు పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆమె అన్నారు, మండల విద్యుత్ అధికారి దినాకర్ మాట్లాడుతూ వినియోగదారులు ఎవరు కూడా విద్యుత్తు మరమ్మతులు చేసుకోకూడదని ఏవైనా విద్యుత్ సమస్యలు వస్తే అధికారులకు తెలిపాలని ఆయన సూచించారు. వ్యవసాయదారులు తమ పొలాల వద్ద విద్యుత్ సమస్యలు ఉంటే అధికారులకు తెలుపకుండానే సొంతంగా మరమ్మతులు చేసుకోవడం జరుగుతుందని దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని ఎట్టి పరిస్థితిలో విద్యుత్ శాఖ అధికారులకు సమస్యలను తెలిపి మరమ్మతులను విద్యుత్ శాఖ అధికారులతో చేయించుకోవాలని ఆయన తెలిపారు, ఏ సమస్యలు ఉన్న వినియోగదారులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు, ఎంపీడీవో దామోదర్ మాట్లాడుతూ ఎన్నికలు జరగక ముందే పార్టీలు అని గెలిచిన తర్వాత పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి పై దృష్టి సారించాలని అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన తెలిపారు, సర్పంచ్ గా గెలవడం అంటేనే ఒక అదృష్టమని ప్రజలకు సేవ చేసుకునే భాగ్యం కలిగిందని గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించి ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాలతి, ఎంపీడీవో దామోదర్, హౌసింగ్ ఏఈ లోకేష్, మిషన్ భగీరథ, ఏఈ స్వప్న, పశువైద్యాధికారి గీతా మాలిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ బుజ్జి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్లు అంజమ్మ, సంధ్య, తో పాటు ఇంటిదగ్గ గ్రామాల సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రావుట్ల గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలకు ఎస్బిఐ సహాయం




**నిజామాబాద్ జిల్లా సిరికొండ ( మన వార్త) మార్చి 6** సిరికొండ మండలం లో రావుట్ల గ్రామం లో ఎస్బీఐ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలకు సహాయం అందించారు. పిల్లలకు అవసరమైన అనేక వస్తువులు, ఎలక్ట్రానిక్ టాయ్స్, ట్రైన్ కుక్కర్లు, ప్లేట్లు, పెన్సిల్స్ వంటి వివిధ రకాల వస్తువులు సాయం అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజకుమార్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు. బాబు స్థానిక అంగన్వాడీ సెంటర్ నిర్వాహకులు, టీచర్ కళ్యాణి, సూపర్వైజర్ సవిత, సిడిపిఓ స్వర్ణలత , పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధి యెడల చిత్తశుద్ధి లేని పాలకులు...

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 06**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజా సమస్యలపై మార్చి 8 నుండి 31 వరకు ఇంటింటికి సిపిఎం ద్వారా సమస్యలు అధ్యయనం చేసి గ్రామీణ ఉద్యమాలు నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ తెలిపారు. శుక్రవారం రోజు భువనగిరిలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జహంగీర్ పాల్గొని మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో అనేక సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని , రోజులు గడుస్తున్న పాలకులు మారుతున్న జిల్లా అభి వృద్ధిలో మాత్రం పురోగతి లేదని అన్నారు. జిల్లా ఏర్పడి పది సంవత్సరాలు గడుస్తున్న మౌలిక సమస్యలు ఎందుకు పెండింగ్ లో ఉన్నాయో జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు , ఎంపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం , సార వంతమైన భూములున్న సరైనా సాగు నీటి వసతులు లేక పంట భూములు బీళ్లు గా మారుతున్నాయని , ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న బస్వాపురం ప్రాజెక్టు పనులు నిధులు లేక పూర్తి కావడం లేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లావ్యాప్తంగా వైద్య రంగానికి తగిన నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల వైద్యం అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నేటికీ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ , పీజీ , ఇంజనీరింగ్ కళాశాల , చౌటుప్పల్ లో డిగ్రీ కళాశాల లేక పేద , మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని , విద్యా అభివృద్ధికి ఈ బడ్జెట్లో తగిన నిధులు కేటాయించాలని కోరారు. దళిత వాడలు , గిరిజన తండాలు సమస్యలకు నిలయంగా మారాయని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని తెలిపారు. చిట్యాల , భువనగిరి ప్రధాన రహదారి వెడల్పు , ఆలేరు రెవెన్యూ డివిజన్ , పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు పోరాడి సాధించిన ఉపాధి హామీ చట్టాన్ని బలహీన పరిచేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్న ఉపాధి హామీ పనుల్లో కేంద్ర ప్రభుత్వం తన వాటా తగ్గించిందని తెలిపారు. అదేవిధంగా నూతన లేబర్ కోడ్ ద్వారా 8గంటల పని 12 గంటలు చేయడం , నూతన విద్యుత్ , విత్తన సవరణ చట్టాల ద్వారా రైతాంగాన్ని , సామాన్యులను నిలువుగా ముంచే బిజెపి పాలనను ఎండగట్టాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయలు , మహిళలకు ప్రతినెల 2500 రూపాయలు , పెన్షన్ పెంపు , ఆడపిల్ల పెళ్లికి ప్రభుత్వం భరోసా , ఉద్యోగ కల్పన హామీలు నెరవేర్చ లేదని ఈ సమస్యల సాధనకు ఏప్రిల్ , మే మాసాల్లో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని జహంగీర్ తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండ మడుగు నర్సింహా , బట్టుపల్లి అనురాధ , జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు , కల్లూరి మల్లేశం , దాసరి పాండు , జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు పాల్గొన్నారు.

## జిపిఓ కార్యాలయం ప్రారంభించిన తహసిల్దార్ రవీందర్ రావు



**నిజామాబాద్ జిల్లా సిరికొండ( మన వార్త) మార్చి 6** సిరికొండ మండలం తూంపల్లి గ్రామంలో గ్రామ పాలన అధికార కార్యాలయాన్ని సిరికొండ మండలం తహసిల్దార్ రవీందర్ రావు వారి చేతులమీదుగా ప్రారంభించారు. తూంపల్లి గ్రామ పాలన అధికారి షేక్ సిజువుద్దీన్, గ్రామ సర్పంచ్ జినుక రాజేందర్, ఉప సర్పంచ్ అయినాల శ్రీకాంత్, మరియు సెక్రటరీ కార్యవర్గం పలు గ్రామాల నుంచి వచ్చిన గ్రామ పాలన అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను ప్రారంభించిన ప్రభుత్వ విప్...

**-చీపురుతో చెత్త నూడ్చిన ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య...**
**-వార్డు ప్రజలచే ప్రతిజ్ఞ నూతన డోజర్ ప్రారంభం...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 06** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట



పట్టణంలోని యాదగిరిపల్లి 2వ వార్డులో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య శుక్రవారం రోజు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మున్సిపల్ డోజర్ ప్రారంభించగా , చైర్మన్ వాణి భారత్ గౌడ్ జెండా ఊపించి ప్రారంభించారు. మున్సిపల్ కార్మికులతో కలసి చీపురు పట్టి చెత్తను ఊడ్చురు. చెత్త తట్టను ఎత్తి ఆటోలో పోశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిందన్నారు. పట్టణాలు , గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని , అభివృద్ధి పనులు వేగంగా కొన సాగించాలని.. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛమైన అభివృద్ధి జరిగేలా యాదగిరిగుట్టను నిర్మించు కోగమని అన్నారు. ప్రతి వార్డులో పరిశుభ్రత , మౌలిక వసతుల అభివృద్ధి , ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చేస్తున్న సేవలు ఎంతో ప్రశంస నీయమని కొనియాడారు. ప్రజలు కూడా పరిశుభ్రత పై అవగాహన కలిగి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారం , పట్టణ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని , ప్రజలకు అందు బాటులో ఉంటానని ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య తెలిపారు.

## కళ్యాణలక్ష్మిషాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చెక్కులు పంపిణీ చేసిన ఆర్డీవో వెంకటేశ్వర్లు




**మన వార్త/ గంభీరావుపేట ప్రతినిధి మార్చి 6** గంభీరావుపేట మండల కేంద్రంలోని షాదీఖానాలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 46 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆర్డిఓ వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ తహసిల్దార్ మారుతి రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు,ఆయా గ్రామాల సర్పంచులు మల్లుగారి పద్మ,రాజ బోయిన అర్చన, లతిక, ఎల్లయ్య, ప్రశాంత్ అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



**మన వార్త/ గంభీరావుపేట ప్రతినిధిమార్చి 6** గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈరోజు తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రణాళిక సందర్భంగా కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మొదటి రోజు లో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి గారి ఆధ్వర్యంలో "క్లీన్ అండ్ గ్రీన్ " కార్యక్రమంలో కళాశాల ఆవరణంలో ఉన్న చెత్త మొక్కలను, పిచ్చి మొక్కలను తొలగించినారు. తదనంతరం పరిసరాలను శుభ్రం చేసి,మొక్కలను నాటడం జరిగింది. ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలను నాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని విద్యార్థుల చేత ప్రిన్సిపాల్ ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా కళాశాలలో సిసిఈ వారి ఆదేశానుసారంగా ప్రిన్సిపల్ కళాశాలలో ఆవరణ పరిశుభ్రత కు మరియు ఫర్నిచర్,ఎలక్ట్రిసిటీ రిపేర్, ఈ వేస్టేజ్, మరియు ఓల్డ్ ఫైల్స్ నిర్మూలన,మొదలగు అంశాలపై వివిధ కమిటీలను కళాశాల వైస్ ప్రిన్సిపల్,మరియు ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ వారిసమక్షంలో వివిధ కమిటీలను అధ్యాపకులకు కేటాయించారు. ఈరోజు కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్పిఓ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో పాల్గొన్నారు. అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం విద్యార్థిని విద్యార్థులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి...



**-సర్పంచ్ బాలస్వామి...**

**చిన్న శంకరంపేట మార్చి 6 ( మన వార్త ప్రతినిధి)** ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ బాలస్వామి సూచించారు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పారిశుద్ధ పనులను నిర్వహించారు రోడ్లుమురికి కాలువలను శుభ్రం చేశారు ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్ వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు

## ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సీఐ వెంకటేష్




**-స్వాగతం పలికిన ఎస్సై రాహుల్ రెడ్డి...**

**ఎల్లారెడ్డిపేట మార్చి :06 (మన వార్తా ప్రతినిధి)** ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఈరోజు అనగా శుక్రవారం రోజున ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఓదెల వెంకటేష్, ఇక్కడ పని చేసిన సిఐ శ్రీనివాస్ గౌడ్, బదిలీపై వెళ్లారు. దీంతో నూతన సిఐ గా బాధ్యతలు చేపట్టిన సిఐ ఓదెల వెంకటేష్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించేందుకు రాగా ఎస్సై రాహుల్ రెడ్డి, పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికినారు అదేవిధంగా నూతనంగా వచ్చిన సీఐ వెంకటేష్ గారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్సారెస్పీ కాలువలో వృద్ధురాలు గల్లంతు



**శంకరపట్నం:మార్చి06(మనవార్త ప్రతినిధి)** శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని చర్లపల్లి గ్రామానికి చెందిన సంబు ఎంకవ్వ (65) అను వృద్ధురాలు శుక్రవారం ఎస్సారెస్పీ కాలువలో గల్లంతయినట్లు గ్రామస్తులు,కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ ప్రక్కన ఎంకవ్వకు చెందిన పాదరక్షలు,చేతి కర్ర కనిపించడంతో కాలువలో పడి గల్లంతైనట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.కుటుంబ సభ్యులు కేశవపట్నం పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకొని పోలీసులు పరిశీలించారు.ఎవరైనా గుర్తించినట్లయితే.ఎస్సై(8712670774) కుటుంబ సభ్యులు(8688262143) నెంబర్లను సంప్రదించాలని ఎస్ఐ శేఖర్ రెడ్డి కోరారు.

## విద్యార్థులు ప్రజాస్వామ్యం,రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలి




**-సత్యశోధక్ లో విద్యార్థుల 'మాక్ అసెంబ్లీ' నిర్వహణ...**

**నిజామాబాద్ జిల్లా సిరికొండ ( మన వార్త) మార్చి 6** విద్యార్థులలో రాజకీయ అవగాహన కల్పించడానికి ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై అవగాహన పెంచడానికి నేడు సత్యశోధక్ పాఠశాలలో విద్యార్థుల మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించడమైనది. విద్యార్థులు అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు, సభ్యుల మాదిరిగా చేసిన ప్రసంగాలు అలరించాయి. విద్యార్థులు స్పీకర్, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకులు, ఎం. యల్. ఎ ల వేశాధారణలో అలరించారు. సభ నిర్వహణ, ప్రశ్నోత్తరాలు, సంక్షేమ పథకాలపైన చర్చలు కళ్ళకు కట్టినట్టు ప్రదర్శించారు. అభివృద్ధి, విద్యా, వైద్యం పైన మరియు నూతన మున్సిపాలిటీల సవరణ, ప్రైవేట్ యూనివర్సిటీ, రవాణా బిల్లుల పైన చర్చ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ప్రజాస్వామ్య ప్రక్రియ, పార్లమెంటరీ విధానాలు, చట్టాల రూపకల్పన మరియు రాజకీయ వ్యవస్థపై ప్రత్యక్ష అవగాహన కల్పించే ఒక విద్యాపరమైన కార్యక్రమమని,ఇది విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, బృందకృషి, తార్కిక ఆలోచన, బహిరంగ ప్రసంగం మరియు నిర్ణయం తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. ప్రదర్శన విద్యార్థులకు గొప్ప అనుభూతి యని ప్రజాస్వామ్యం,రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించడమైనది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో సామూహిక సీమంతం నిర్వహించిన అధికారులు



**చిన్న శంకరంపేట మార్చి 6 ( మన వార్త ప్రతినిధి )** తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సంతోష నవీన్ తెలిపారు, చిన్న శంకరంపేట మండల పరిధిలోని రుద్రారం రెండవ అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలను నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష మాట్లాడుతూ బాలింతలు గర్భిణీ స్త్రీలు పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకుంటేనే తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటటారన్నారు, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ అంజమ్మ ఉప సర్పంచ్ నర్సింలు అంగన్వాడి టీచర్ రాణి, గర్భిణీ స్త్రీలు, మహిళలు పాల్గొన్నారు

## విద్యార్థులే ఉపాధ్యాయులై...



**చిన్న శంకరంపేట మార్చి 6 ( మన వార్త ప్రతినిధి )** చిన్న శంకరంపేట మండల పరిధిలోని చందాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు జిల్లా విద్యా శాఖ అధికారిగా మౌనిక ప్రధానోపాధ్యాయులుగా శివతేజ ఉపాధ్యాయులుగా శివకుమార్ శ్రీధర్ ఐశ్విక కిట్టు ప్రణీత్ కుమార్ లు విధులు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెతుకు పరమేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయురాలు తోటవ్వ, విద్యార్థులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన టిఆర్ఎస్ నాయకులు



**చిన్న శంకరంపేట మార్చి 6 ( మన వార్త ప్రతినిధి )** బాదిత కుటుంబానికి బిఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు చిన్న శంకరంపేట మండల పరిధిలోని జంగరాయ్ గిరిజన తండా కు చెందిన రవి నాయక్ నివాస పూరి గుడిసె ప్రమాదవశాత్తు దగ్ధమైంది విషయాన్ని తెలుసుకున్న బిఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి బా దిత కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని సూచించడంతో స్థానిక బిఆర్ఎస్ నాయకులు బాదిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు, ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, బాగా రెడ్డి, రమేష్ నాయక్, మోతీరాం, భూపాల్ రెడ్డి, కాట్రోత్ శ్రీనివాస్, బందెల సుధాకర్, కాట్రోతు చందర్, తదితరులు పాల్గొన్నారు

## భువనగిరిలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ప్రారంభం...



**-భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధి కై ప్రతిజ్ఞ...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 06** ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి 6వ తేదీ నుండి మార్చి 15వ తేదీ వరకు నిర్వహించ బడుతుంది. భువనగిరి పురపాలక సంఘం పరిధి లోని స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం రోజు లాంఛనంగా ప్రారంభించడం జరిగింది. కార్యక్రమానికి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్ రావు , జాయింట్ డైరెక్టర్ టిఎస్ విఎన్ త్రిల్లేశ్వర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల , భువనగిరి మున్సిపల్ కమిషనర్ జి. రామలింగం , వార్డు సభ్యులు , మున్సిపల్ అధికారులు , సిబ్బంది హాజరయ్యారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా అందరూ పరిసరాల పరి శుభ్రతకు సంబంధించి భువనగిరి మున్సిపాలిటీ వారు చేపడుతున్న అన్ని కార్యక్రమాలలో పాల్గొంటానని మనసా వాచా కర్మణా నా వంతుగా మున్సిపాలిటీ యొక్క అభివృద్ధికి కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి పురపాలక సంఘ పరిధిలోని మొత్తం 35 వార్డులలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం , అభివృద్ధి కార్యక్రమాల అమలు , ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం అందరితో కలిసి 8 వ వార్డులో స్వయంగా చీపురు పట్టి రోడ్లు ఊడ్చి చెత్త ఎత్తి ఇట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అన్ని వాటిల్లో విజయవంతంగా చేయాలని కోరారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీ నామ, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల



**మధిర మార్చి6( మన వార్త ):**మధిర నియోజకవర్గం, ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెం గ్రామ మాజీ సర్పంచ్ యరమల రేణుక×కృష్ణారెడ్డి దంపతుల కుమారుడు సాంబశివరెడ్డి వివాహం మధిర వాస్తవ్యులు శీలం కాశీ విశ్వేశ్వరరెడ్డి×పద్మ దంపతుల కుమార్తె శ్రావణితో మధిర వైరా రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నాడు ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు బీఆర్ఎస్ మాజీ లోక్సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ జడ్పీ చైర్మన్, మధిర అసెంబ్లీ ఇంచార్జి లింగాల కమల్ రాజు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి బంధుమిత్రులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న డిసిసి ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి



**నిజామాబాద్ జిల్లా సిరికొండ ( మన వార్త ) మార్చి 6** సిరికొండ మండలం గడుకోలు గ్రామానికి చెందిన నర్సరెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో డిసిసి ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో పాల్గొన్నవారు సిరికొండ మాజీ సర్పంచ్ చిట్యాల రవిశంకర్, కట్టాజి శ్రీనివాస్ వారి స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులు ప్రారంభించిన చైర్మన్

**-త్వరితగతిన పనులు పూర్తయ్యేందుకు కృషి చేస్తాం...**

**మధిర మార్చి6( మన వార్త):** పట్టణంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత ప్రారంభించారు. పట్టణంలోని డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయం ప్రాంతంలో లాంఛనంగా ఎన్పీడీసీఎల్ డి ఈ బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులకు మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సుజాత మాట్లాడుతూ మధిర పట్టణం ను మోడల్ నియోజకవర్గ కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో వివిధ అభివృద్ధి పనులకు గాను కోట్లాది రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు ద్వారా పట్టణం మెట్రో సిటీలతో సమానంగా అభివృద్ధి పథంలో అడుగులు వేయనున్నదని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభం కానున్న ఈ పనులు త్వరితగతి న నాణ్యత ప్రమాణాలతో పూర్తయ్యే విధంగా అధికారులు నిర్వహించాలని ఆమె కోరారు. అనంతరం డి ఈ బండి శ్రీనివాస్ మాట్లాడుతూ రూ. 28.14 కోట్లతో చేపడుతున్న ఈ పనులు పట్టణములో ప్రమాదాలు లేని విద్యుత్ సరఫరా కు మార్గం సుగమం కానున్నదని అన్నారు. కేబుల్ లైన్ నిర్మాణాలు పూర్తయితే అవంతరాలు లేని విద్యుత్ అందించడం జరుగుతుందని అన్నారు. పనులను చేపడుతున్న క్రమంలో విద్యుత్ శాఖతోపాటు మున్సిపల్ శాఖ,టెలికాం, తాగునీటి సరఫరా, ఆర్ అండ్ బి శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని కేబుల్ నిర్మాణ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోన రవికుమార్ కౌన్సిలర్లు బోడెపుడి రేవతి, నాగార్జున తో పాటు కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మిర్యాల రమణ గుప్తా నాయకులు రంగా హనుమంతరావు పాటిబండ్ల సత్యంబాబు కర్నాటి రామారావు మాగం ప్రసాద్ రంగా శ్రీనివాస్ దోర్నాల సునీల్ ఎర్రమదాసు ప్రభాకర్ తలుపులు వెంకటేశ్వర్లు డేవిడ్ బోడిపుడి గోపి సామినేని రామనాథం బుల్లెద్దు రాజేంద్ర అద్దంకి రవికుమార్ సాలిక సురేష్ తదితరులు ఉన్నారు.



## ముసలమ్మ తల్లిని దర్శించుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకురాలు



**ములుగు జిల్లా మార్చ్ 6 మనవార్త ప్రతినిధి** కొత్తగూడ ములుగు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణభివృద్ధి స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ వర్యులు ధనసరి సీతక్క కోడలు ములుగు నియోజకవర్గ నాయకురాలు (కుంజా కూసుమాంజలి సూర్య ) ముసలమ్మ తల్లి ని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ıవిశేష పూజలు మరియు ప్రార్థనలు ıఆలయ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ:ıప్రజా క్షేమం: నియోజకవర్గంలోని ప్రతి ఇల్లు పాడిపంటలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు.ıఅభివృద్ధి: ములుగు ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజల కష్టాలు తీరాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ıభక్తి శ్రద్ధలు: దేవతల ఆశీస్సులు ఉంటేనే సమాజం బాగుంటుందని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు.కార్యకర్తల కోలాహలం ఈ కార్యక్రమంలో నాయకురాలితో పాటు భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయాయి. దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు...



**-సమాజ అభివృద్ధిలో మహిళలది కీలక పాత్ర...**

**-బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 06** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపో అవరణలో శుక్రవారం రోజు నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య సతీమణి , బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కుని బీర్ల ఫౌండేషన్ సౌజన్యంతో మహిళలకు ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళ కండక్టర్లకు చీరలను అందజేశారు. అనంతరం ఆలేరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళ కాంగ్రెస్ నాయకురాళ్లతో కలసి మహిళ దినోత్సవం వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం , సామాజిక సంస్థలు కలిసి పని చేయాలని పేర్కొన్నారు. అలాగే మహిళల కృషిని ప్రశంసిస్తూ , వారి అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్...

**-ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య...**

**-ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు పట్టు బట్టలు అందజేత...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 06** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పురపాలక సంఘం పరిధిలోని స్థానిక 3వ వార్డులో ఎక్కల పద్మ లబ్ధి దారురాలి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం నిర్వహించగా , లబ్ధిదారురాలి కుటుంబానికి పట్టుబట్టలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని అన్నారు.ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు , నాయకులుళ, కార్యకర్తలు స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ కార్యాలయాలు,ఇందిరమ్మ ఇండ్ల ఏర్పాటుకు కృషి చేస్తా



**-టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్...**

**శంకరపట్నం:మార్చి06(మనవార్త ప్రతినిధి)** శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపగోని బస్వయ్య గౌడ్ తో కలిసి శుక్రవారం పర్యటించారు.టీజేఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మోరె గణేష్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నేరెళ్ళ సంతోష్ ఆహ్వానం మేరకు మొలంగూర్ లోని మిద్దె గోడలను,మరియు ఖిల్లాలో గల అభయంజనేయ స్వామి దేవాలయాన్ని,703 ప్రభుత్వ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా బత్తిని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ,,చారిత్రక కట్టడాలను కాపాడుకుందామని,అందులో ఉన్న 2 ఎకరాల 10 గుంటల స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాల కింద కేటాయించడం,703 సర్వే నెంబర్ లోని ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతామన్నారు.అలాగే అభయాంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.ఇట్టి ప్రభుత్వ భూములపై ప్రభుత్వం,అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పనులు జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజా పాలనలో భాగంగా గౌరవ శాసనసభ్యులతో పాటు మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లి మొలంగూర్ గ్రామానికి తీసుకొస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండు రాజేష్,గాజుల శ్రీనివాస్,పెంట సాంబయ్య,చీకట్ల కుమార్,కుంట తిరుపతి రెడ్డి,గాజుల మహేష్,కల్లూరి సంతోష్,అన్నాడి తిరుపతి రెడ్డి,నల్ల వెంకట్ రెడ్డి,కాలేషి కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యార్థం మండపం నిర్మించిన కొత్తకాపు కుటుంబం





**జహీరాబాద్, మార్చి 6 (మన వార్త):** శ్రీ మాణిక్ ప్రభు మందిరం ఆవరణలో కొత్తకాపు కుటుంబం తమ సొంత నిధులతో నిర్మించిన మండపాన్ని దాతలతో కలిసి అఖిల భారత ధర్మ జాగరణ సహ సంయోజక్ ఆలె శ్యామ్ కుమార్ ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ కేంద్రం మాణిక్ ప్రభు వీధి, శ్రీ మాణిక్ ప్రభు మందిరం ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం కొత్తకాపు సుభాష్ రెడ్డి, బిఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షులు కొత్తకాపు లక్ష్మారెడ్డి లు వారి తల్లి అయిన కొత్తకాపు ఈశ్వరమ్మ జ్ఞాపకార్థం ఆమె పేరుతో మండపాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పురపాలక సంఘం వైస్ చైర్మన్ కొత్తకాపు శిరీష సురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలే శామ్ కుమార్ మాట్లాడుతూ కొత్త కాపు కుటుంబం భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మందిరం ప్రాంగణంలో ఇంత విశాలమైన మండపాన్ని నిర్మించడం అభినందనీయమని కొనియాడారు. మనిషి తన జీవితంలో సమాజం కొరకు మంచి చేయలేక పోయినా, ఎట్టి పరిస్థితిలో చెడు మాత్రం చెయ్యకూడదని సూచించారు. కొత్తకాపు కుటుంబ పెద్దలు చేసిన మంచి పనులు, వారి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అనంతరం పాల్గొన్న శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్ పాల్గొని ధర్మ సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో కొత్తకాపు కుటుంబ సభ్యులు కె అమర్ నాథ్ రెడ్డి, పదవి విరమణ ఉపాధ్యాయులు బెండి రాచప్ప, యువ నాయకులు పైడిగుమ్మల్ సిద్ధూ (రామన్నా), నాగిరెడ్డి, కె శ్రీనివాస్ రెడ్డి, బెండి శివకుమార్, మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు వెంకటయ్య, ప్రిన్సిపాల్ మధు, జగన్నాథ్ రెడ్డి, జగ్గారెడ్డి వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## బొమ్మలరామారం మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 06** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలో శుక్రవారం రోజు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక పరిశుభ్రత కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో చేపట్టిన పరిశుభ్రత పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామంలో పర్యటిస్తూ పరిశుభ్రత , పారిశుధ్యం పనులు పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. అనంతరం అదే గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని , వాటిలో ఎన్ని ఇండ్లు నిర్మాణం పూర్తి అయ్యాయని , మిగిలినవి ఏ దశలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. మండలంలోని మసిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలు ఇలా జరుగుతున్నాయి మురికి కాలువలను శుభ్రం చేస్తున్నారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారా పరిశుభ్రత పారిశుధ్యం వంటి కార్యక్రమాలు తరచూ చేపడుతుండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటిస్తూ ఎలా చదువు తున్నారని విద్యార్థులను అడిగారు. అనంతరం అంగన్వాడి కేంద్రానికి రోజు ఎంతమంది పిల్లలు వస్తున్నారని..ఈరోజు ఎంతమంది పిల్లలు వచ్చారని అడిగారు. అందులో గర్భిణీ స్త్రీలు బాలింతలు కూడా ఎంతమంది ఉన్నారని అడిగారు. గర్భిణీ స్త్రీలు అంగన్వాడి కేంద్రానికి వచ్చి ఫుడ్ తింటున్నారా..ప్రతి నెల చెకప్ చేయించు కుంటున్నారా..అని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రంలో ఉన్న చిన్నారికి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్న ప్రసన్న చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ప్రజా ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తె మట్టెలు అందజేత



**ఇల్లంతకుంట,మార్చి 06 (మన వార్త ప్రతినిధి );**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల గ్రామానికి చెందిన పాడి రైతు కోమటిరెడ్డి సత్యవ్వ స్వామి రెడ్డి దంపతుల కుమార్తె దివ్య వివాహానికి కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో పుస్తె మట్టెలు అందించిన ఏం.సి.సి అగ్రహారం మేనేజర్ గట్టు రవీందర్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ డైరీ అనేక సంక్షేమ కార్యక్రమాలు రైతుల కోసం అందిస్తున్నదని అన్నారు. అందులో భాగంగా కళ్యాణమస్తు పథకం కింద పాడి రైతు కుమార్తె కి పుస్తే మట్టెలు అందించామని అన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వెంకట్రాంరెడ్డి,ఎంపీఐ అధ్యక్షులు సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి,బద్దం రవీందర్ రెడ్డి,సెక్రటరీ గంగ చారి తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ లో బ్రైడల్ షో



**-బ్రైడల్ షోనీ ప్రారంభించిన ప్రారంభించిన...**

**-డాక్టర్ ఆకుల శైలజ,స్టోర్ హెడ్ ఫవాజ్...**

**కరీంనగర్,మార్చి 7( మన వార్త ప్రతినిధి )**కరీంనగర్ మలబార్ గోల్డెన్ డైమండ్స్ లో బ్రైడల్ షో ఆభరణాల ప్రదర్శనను డాక్టర్ ఆకుల శైలజ కరీంనగర్ ఐ ఎం ఏ అధ్యక్షురాలు,స్టోర్ డైరెక్టర్ ఫవాజ్, కస్టమర్లచే కలిసి ప్రదర్శనని ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఆకుల శైలజ మాట్లాడుతూ మలబార్ అంటేనే నమ్మకం, శ్రేష్టతను అందించే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ లో బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శనలో భాగంగా కస్టమర్ల కోసం ప్రత్యేకంగా అన్ని రకాల వయస్సు గలవారికి అనుగుణంగా గోల్డ్, డైమండ్, ప్రీసియా స్టోన్స్, అన్ కట్ డిజైన్స్ అందుబాటు దరలలో లభిస్తాయని తెలిపారు. అనంతరం మలబార్ స్టోర్ హెడ్ ఫవాజ్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఈ యొక్క బ్రైడల్ జ్యువలరీ షో సందర్భంగా కరీంనగర్ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ లో ప్రతి ఆభరణాల కొనుగోలు పై ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని, బంగారం,రత్నాభరణాలు, అన్ కట్ ఆభరణాల తరుగు ఛార్జిలపై 40 శాతం తగ్గింపు ఉందని,అలాగే వజ్రాల విలువపై 30 శాతం వరకు తగ్గింపు ఉందని,ఈయొక్క ఆఫర్ మార్చి 7 నుండి మార్చి 16 వరకు కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్టోర్ మేనేజర్ సోహల్, అసిస్టెంట్ మేనేజర్ సిద్ధాంత్,మార్కెటింగ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వెలిగేటి విక్కీ,మార్కెటింగ్ ఇంచార్జ్ శ్రీనివాస్,కస్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకొని రైస్ మిల్ వ్యాపారి భార్య ఆత్మహత్య



**శంకరపట్నం:మార్చి06(మనవార్త ప్రతినిధి)**శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో శుక్రవారం రైస్ మిల్ వ్యాపారి భార్య తణుకు సప్న(42) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.బంధువులు,పోలీసుల కథనం ప్రకారం కొత్తగట్టు గ్రామానికి చెందిన తణుకు సురేష్ మొలంగూర్ గ్రామ శివారులో రెండు రైస్ మిల్లులను నిర్వహిస్తున్నాడు.సీఎంఆర్ కింద 2021-22 సంవత్సరంలో తీసుకున్న వడ్లు తడిచిపోవడం వల్ల తిరిగి ప్రభుత్వానికి ఇవ్వలేకపోవడం,బ్యాంకులో తీసుకున్న అప్పులకు సంబంధించి కిస్తీలు చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు రెండు రైస్ మిల్లులను సీజ్ చేశారు.రెండు రైస్ మిల్లులు నడవకపోవడంతో ఆర్థిక సమస్యలు ఏర్పడ్డాయి.ప్రభుత్వం ఇచ్చిన కస్టమ్స్ మిల్లు సైతం బకాయిలు పేరుకపోవడంతో కుటుంబంలో ఆర్థిక సమస్యలు ఏర్పడ్డాయి.ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్థాపానికి గురై శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో సురేష్ భార్య సప్న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.ఆర్థిక ఇబ్బందులతోటే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలు భర్త సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు.

# ఈ నెల10 వరకు మోడల్ స్కూల్ అడ్మిషన్లకు ఆన్లైన్ దరఖాస్తుల ఆహ్వానం

**-ప్రిన్సిపాల్ కే.ప్రభాకర్...**

**శంకరపట్నం:మార్చి06(మనవార్త ప్రతినిధి)** శంకరపట్నం మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్‌లో చదవాలనుకునే విద్యార్థినీ,విద్యార్థులు ఈనెల 10 వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ కె.ప్రభాకర్ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి అడ్మిషన్ల కోసం ఆన్లైన్ దరఖాస్తులు ఈనెల10 వరకు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కే. ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.అడ్మిషన్ కోసం ఆసక్తి గల విద్యార్థులు www.tgms.telangana.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.ఈ అవకాశాన్ని శంకరపట్నం మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ కే. ప్రభాకర్ కోరారు.

# వీరనారాయణపూర్ గ్రామంలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**ఎల్కతుర్తి మార్చి 6 మనవార్త ప్రతినిధి**హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వీరనారాయణపూర్ గ్రామంలో శుక్రవారం ఉదయం గ్రామ పంచాయితీ ఆవరణలో కల్యాణ లక్ష్మి పథకం చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుల్లూరి శ్రీధరరావు చేతుల మీదుగా అర్హులైన మహిళలకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పుల్లూరి శ్రీధరరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి పథకం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన అమ్మాయిల వివాహానికి ఆర్థికంగా తోడ్పడేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం వల్ల కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతోందని చెప్పారు. సమాజంలో మహిళలకు గౌరవ స్థానం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మోటకొండూరు మండలంలో పర్యటించిన ప్రభుత్వ విప్...

**-ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను ప్రారంభించిన బీర్ల అయిలయ్య...**

**-మండలంలో పరిశుభ్రత పారిశుధ్యం పనులు చేపట్టాలి...**

**-నూతన వైకుంఠ రథం..పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవం...**




**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 06** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో నూతన పెట్రోల్ బంక్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య శుక్రవారం రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా బంక్ యజమాని , సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాలనీలో ఏర్పాటుచేసుకున్న బుడగ జంగాల కార్యాలయాన్ని ప్రారంభించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని ప్రారంభించారు. మోటాకొండూరు గ్రామ పంచాయతీ ఆవరణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామంలో స్వచ్ఛత , పరిశుభ్రత తో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ముందుండాలని కోరారు.

# పురపాలకలో ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక



**జహీరాబాద్, మార్చి 6 (మన వార్త):** జహీరాబాద్ పురపాలక సంఘం కార్యాలయం ఆధ్వర్యంలో ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం నుండి ప్రధాన రహదారి 65 పై ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక పై 99 రోజుల కార్యాచరణలో పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ లు, కమిషనర్, మేనేజర్, కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య, మెప్మా, అర్పీలు పాల్గొన్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక పై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ లు, కమిషనర్, మేనేజర్, కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య, మెప్మా, అర్పీలు పాల్గొన్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

# పశువైద్యశాల ఆవరణలో మద్యం మోత చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్




**ఎల్కతుర్తి మార్చి 6 మనవార్త ప్రతినిధి** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రానికి సమీపంలోని వల్బాపూర్ గ్రామంలో ఉన్న గ్రామీణ పశువైద్యశాల ఆవరణలో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ బీర్ సీసాలు, మద్యం బాటిళ్లను అక్కడే పడేస్తుండటం గ్రామస్థులను ఆందోళనకు గురిచేస్తోంది.రాత్రి వేళల్లో మాత్రమే కాకుండా మధ్యాహ్న సమయంలో కూడా అక్కడికి చేరుకుని మద్యం సేవించి ఖాళీ బాటిళ్లను పశువైద్యశాల ముందు మరియు పరిసర ప్రాంతాల్లో పడేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కొన్నిసార్లు బీర్ సీసాలను పగలగొట్టి రోడ్డుపై వేయడం వల్ల ఆ మార్గంలో వెళ్లే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వారు పేర్కొన్నారు. పశువైద్యశాల సమీపంలోని వాటర్ ప్లాంట్ పక్కన కూడా గాజు సీసాలు పడివుండటం సమస్యగా మారింది.అలాగే పశువైద్యశాల పక్కనే ఉన్న శివాలయానికి భక్తులు వెళ్లే దారిలో గాజు సీసాల ముక్కలు ఉండటంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఆ మార్గంలో నడిచే సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి వెంటనే స్పందించి అక్కడ మద్యం సేవిస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే పోలీస్ శాఖ సహకారంతో పర్యవేక్షణ పెంచి ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.గ్రామంలోని ప్రజా ప్రదేశాలు, దేవాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

# మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ చందానగర్ షోరూంలో ప్రవేశపెడుతుంది అద్వితీయమైన బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శన




**శేరిలింగంపల్లి మార్చి 06 (వన వార్త ప్రతినిధి)**మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ చందానగర్ షోరూంలో ప్రవేశపెడుతుంది అద్వితీయమైన బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శన.ఈ ప్రదర్శన 2026 మార్చి 07 నుండి మార్చి 15 వరకు జరుగుతుంది. ఈ ప్రదర్శనలో బంగారం,వజ్రాభరణాలు మరియు జాతి రత్నాభరణాలను ప్రదర్శిస్తుంది.ఈ ఆభరణాలు అద్వితీయమైన కళానైపుణ్యతతో, అంతులేని హుందాతనంతో కూడినవి. నగిషీ చెక్కిన ప్రతీ ఆభరణం తయారు చేసిన వారి అనుభవం ఇంకా కళాత్మకతకు నిదర్శనంగా నిలుస్తుంది.ఈ అద్వితీయమైన బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శనని ముఖ్య అతిథులు మలబార్ కస్టమర్స్,మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ టీం మెంబెర్స్,ఉన్నత అధికారులు మరియు శ్రేయోభిలాషుల సమక్షంలో ప్రారంభించారు.ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణలుగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారి బ్రాండుల సమాహారం మైన్ ధ్రువీకరించబడిన వజ్రాభరణాలు,వివాహ మరియు పార్టీ సంబరాల కోసం,"ఎరా" అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి, "ప్రేషియ్"జాతిరత్నాభరణాల సముదాయం, "ఎత్నిక్స్"హస్తకళా నైపుణ్యంతో తయారైన ఆభరణాలు,"డివైన" భారతీయ ప్రాచీన సంప్రదాయం వ్యక్తం చేసే ఆభరణాలు ఇంకా చిన్నారుల కోసం "స్టార్లెట్" పిల్లల ఆభరణాలు సమకూర్చారు.ఈ ప్రదర్శన చందానగర్ లో 07 మార్చి నుండి 15 మార్చి 2026, వరకు నిర్వహించబడుతుంది.మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నిబద్ధతలో భాగంగా,తమ వినియోగదారులకు 12 న్యాయమైన వాగ్దానాలను అందిస్తుంది. ఖచ్చితమైన తయారీ ధర,రాళ్ళ బరువు, నికర బరువు మరియు ఆభరణాల రాళ్ళ విలువతో కూడిన పారదర్శక ధరల పట్టి, ఆభరణాలకు జీవితకాల ఉచిత నిర్వహణ, పాత బంగారు ఆభరణాలను తిరిగి విక్రయించేటప్పుడు బంగారానికి 100 శాతం విలువ మరియు బంగారం మార్పిడిపై శూన్య తగ్గింపు, నూరు శాతం బి.ఐ.ఎస్ (హెచ్ యు ఐ డి) హాల్ మార్కుతో ధృవీకరించబడిన స్వచ్ఛమైన బంగారం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 28-పాయింట్ల నాణ్యత పరీక్షలు నిర్వహించిన ఐజిఐ మరియు జిఐఎ ధృవీకరించిన వజ్రాభరణాలు,బైబ్యాక్ గ్యారెంటీ,నాణ్యతను తనిఖీ చేయడానికి క్యారెట్ ఎనలైజర్,జీవితకాల నిర్వహణ మరియు బాధ్యతాయుతమైన మూలాల నుండి బంగారం సేకరణ వంటి వాగ్దానాలను అందిస్తుంది.

# మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డ వృద్ధురాలు...



**నార్సింగి మార్చి 6 ( మన వార్త ప్రతినిధి)** చిన్న కొడుకు 20 రోజుల క్రితం చనిపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఓ వృద్ధురాలు(85) చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగి మండలం శంకాపూర్ అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామయంపేట మండలం జాన్సీ లింగాపూర్ కు చెందిన శాలిపేట రుక్కమ్మ భర్త సిద్దయ్య చిన్న కొడుకు చనిపోవడంతో మనస్థాపానికి గురై రెండు రోజుల కింద ఇంటి నుంచి వెళ్లిపోయి శుక్రవారం అటవీ ప్రాంతంలో శవమై లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వృద్ధురాలు శాలిపేట రుక్కమ్మకు నలుగురు కుమారులు ఒక కుమార్తె ఉండేదని వారిలో ఇద్దరు కుమారులు ప్రమాదవశాత్తు చనిపోవడం జరిగిందని అప్పటినుండి తన తల్లి కూడా ఆత్మహత్య చేసుకుంటాను అని అంటుండేదని మృతురాలి కుమారుడు సిద్ధిరాములు ఫిర్యాదు చేయడం జరిగిందని చేసినట్లు పోలీసులు తెలిపారు.

# గురుజువాడలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 3వ విడత ప్రారంభం




**జహీరాబాద్, మార్చి 6 (మన వార్త):** జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలం గురుజు వాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన□ప్రగతి ప్రణాళిక మూడో విడత కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోహీర్ ఎంపీ ఓ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, ప్రజా పాలన□ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రియాంక ప్రతినిధి రాజేందర్, ఎంపీ ఓ వెంకటరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, గ్రామ మల్టీ పర్పస్ వర్కర్స్ గ్రామస్థులు పాల్గొన్నారు.


# శేరిలింగంపల్లి జిహెచ్ఎంసి సర్కిల్-49లో ఏసీబీ మెరుపుదాడులు




**-టౌన్ ప్లానింగ్ విభాగంపై ప్రత్యేక దృష్టి అవినీతి ఆరోపణలపై తనిఖీలు...**

**శేరిలింగంపల్లి, మార్చి 6 (వన వార్త ప్రతినిధి)**శేరిలింగంపల్లి జిహెచ్ఎంసి సర్కిల్-49 కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు ఆకస్మిక మెరుపుదాడులు నిర్వహించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా అన్ని విభాగాలను పరిశీలించినప్పటికీ, టౌన్ ప్లానింగ్ విభాగంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.సర్కిల్-49 పరిధిలోని పలు విభాగాలపై తనిఖీలు చేపట్టిన ఏసీబీ బృందం ముఖ్యంగా పట్టణ ప్రణాళిక విభాగంలోని పత్రాలు, ఫైళ్లను పరిశీలించింది. ఈ విభాగానికి ముఖ్య అధికారిగా ప్రాతినిధ్యం వహిస్తున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటరమణ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యకలాపాలపై గత కొంతకాలంగా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నట్లు తెలుస్తోంది.ఇటీవలి కాలంలో పలు వార్తాపత్రికల్లో వచ్చిన కథనాలు, అలాగే బాధితుల నుంచి అందిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని ఈ తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. నిర్మాణ అనుమతులు, లేఅవుట్ ఆమోదాలు వంటి అంశాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు ఫైళ్లు, రికార్డులు, కంప్యూటర్ డేటాను సేకరించినట్లు తెలిసింది.ఈ దాడుల సందర్భంగా సర్కిల్-49లోని అన్ని విభాగాల పనితీరును కూడా అధికారులు పరిశీలించారు. అయితే టౌన్ ప్లానింగ్ విభాగంలో నిర్వహించిన తనిఖీలు ఎక్కువసేపు కొనసాగినట్లు అక్కడి వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు మాట్లాడుతూ, తనిఖీల్లో లభించిన ఆధారాలపై పూర్తి వివరాలను శనివారం వెల్లడిస్తామని స్పష్టం చేశారు..

# మాజీ సర్పంచ్లకు బిల్లులు చెల్లించాలి కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచుల డిమాండ్



**చిన్న శంకరంపేట మార్చి 6 ( మన వార్త ప్రతినిధి)** ఒకే పార్టీలో రెండు స్వరాలు రావడంతో మాజీ సర్పంచులు అయోమయానికి గురవుతున్నారు మాజీ సర్పంచులకు రెండేళ్ల బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది పాత సర్పంచ్లకు బిల్లులు చెల్లించాలని జీవో జారీ చేస్తే పాత సర్పంచులకు బిల్లులు చెల్లించవద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి తెలిపారు పాత సర్పంచులకు రావలసిన బిల్లులను వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిన్న శంకరంపేట మాజీ సర్పంచ్ రాజిరెడ్డి డిమాండ్ చేశారు గురువారం చిన్న శంకరంపేటలో జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి మాజీ సర్పంచ్ రాజిరెడ్డి లు వేర్వేరుగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు మాజీ సర్పంచులు అధికంగా బిల్లులు చేయించుకొని ఎంబి రికార్డ్ చెక్కు మెజర్మెంట్లు చేయించుకున్న వారికి ఎట్టి పరిస్థితుల్లో బిల్లులు ఇవ్వద్దని గోపాల్ రెడ్డి తెలిపారు న్యాయంగా ఉన్న బిల్లులకు మాత్రమే బకాయిలను చెల్లించాలన్నారు గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు తెచ్చి పనులు చేస్తే అట్టి పనులకు బిల్లులు ఇవ్వద్దనీ అనడం వాళ్ళ అవివేకానికి నిదర్శనం అని కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిన్న శంకరంపేట మాజీ సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు తాము గ్రామాలలో అభివృద్ధిపనులు నిర్వహించి అధికారులతో రికార్డులు చేయించుకుంటే అట్టి రికార్డులు సరిగ్గా లేవని గోపాల్ రెడ్డి అనడం సరైనది కాదన్నారు అభివృద్ధి పనుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక అప్పుల ఊబిలో కూర్కపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు మాజీ సర్పంచ్లకు రావాల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు ఇలా ఒకే పార్టీ నాయకుల్లో బిల్లులు ఇవ్వాలని ఒకరు ఇవ్వద్దని మరొకరు రెండు స్వరాలు రావడంతో మాజీ సర్పంచులు అయోమయానికి గురి అవుతున్నారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగ నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రణాళిక 99



**నిజామాబాద్ జిల్లా సిరికొండ ( మన వార్త) మర్చి 6** సిరికొండ మండలం సర్పంచ్ తండా గ్రామపంచాయతీ యందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రణాళిక 99లో భాగంగా గ్రామ సర్పంచ్ చందర్ నాయక్ ఆధ్వర్యంలో పాలకవర్గం సమక్షంలో మొదటిరోజు షెడ్యూల్లో భాగంగా గ్రామ పంచాయతీ ఆవరణలో పరిశుభ్రంగా చేయడం జరిగింది.

## బీరప్ప గుడికి భూమి పూజ చేసిన ప్రభుత్వ విప్...

**-దొడ్డి కొమరయ్యకు నివాలు అనంతరం భారీ ర్యాలి...**
**-హజరైన ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య. ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 06** జనగామ జిల్లా బచ్చన్న పేట మండలం కొన్నే గ్రామంలో శుక్రవారం రోజు బీరప్ప స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య , జనగామ శాసనసభ్యులు పల్ల రాజేశ్వర్ రెడ్డిలు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీ గా వెల్లి బీరప్ప స్వామి ఆలయానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ కొన్నే గ్రామంలో శ్రీ శ్రీ బీరప్ప స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆలయాలు మన సంస్కృతి , సంప్ర దాయాలకు ప్రతీకలని తెలిపారు. ఈ ఆలయం నిర్మాణం పూర్తయిన తర్వాత భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు. గ్రామ ప్రజలు ఐక్యంగా ఉ ండి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి , ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల ఆశీర్వాదాలతో మరింత సేవ చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు , నాయకులుళ, గ్రామ పెద్దలు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**రాయపోల్ మార్చి 06 మన వార్త:** దౌల్తాబాద్ మండలం శేరిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యను బోధించారు. డీఈవోగా అయాజ్, మండల విద్యాధికారిగా వర్షిత, ప్రధానోపాధ్యాయురాలుగా మనస్విని తోపాటు పలువురు విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు స్వయం పరిపాలనతో తమ బాధ్యతలను తెలుసుకుంటారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బోధన అంశంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అమల, హర్షిణి, తదితరులు పాల్గొన్నారు....

## రాబోయే రోజుల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం....

**-మల్కాజి గిరి ఎంపీ ఈటెల రాజేందర్...**

**నార్సింగి మార్చి 6 ( మన వార్త ప్రతినిధి)** రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ మర్చిపోయిందని తెరాస పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయిందని మాజీ మంత్రి మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు, హైదరాబాదు నుండి నిజామాబాద్ వెళ్తున్న మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ను నర్సింగ్ మండల బిజెపి నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు అనంతరం నార్సింగి మండల కేంద్రంలో బిజెపి కార్యకర్తలతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా మాత్రమే రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ప్రజలంతా గమనిస్తున్నారని ఆయన అన్నారు ప్రజాక్షేత్రంలో ప్రజలు బిజెపిని ఆదరించి రాష్ట్రంలో అభివృద్ధి దిశగా 2028 లో అధికారమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను మరిచిపోయిందని టీఆర్ఎస్ పార్టీపై ప్రజలు విశ్వాసం కోల్పోయారని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ కిసాన్ మార్చా జిల్లా ఉపాధ్యక్షులు లింగారెడ్డి పట్టణ అధ్యక్షులు మైలారం నరసింహులు మాజీ వార్డు సభ్యులు నరేష్ యాదగిరి శ్రీనివాస్ నరేష్ నాయక్ సాయికుమార్ వినోద్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు



## 10వ తరగతి విద్యార్థులకు డీఈవో రాము చేతుల హాల్ టికెట్స్ పంపిణీ




**జగిత్యాల , మార్చి 6 (మన వార్త ప్రతినిధి)**స్థానిక జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పురానిపేటలో మార్చి 14 తారీకు నుండి జరగబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులకు డీఈవో రాము చేతుల మీదుగా హాల్ టికెట్లు చేశారు ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని డిఈవో పరీక్షలు రాసే విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ.. గత సంవత్సరం కూడా హాల్ టికెట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించినటువంటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పురాణపేట విద్యార్థుల గురించి గుర్తు చేశారు. నేషనల్ సైన్స్ డే సందర్భంగా పాల్గొన్న వారిలో విజయం సాధించినటువంటి డీఈఓ చేతుల మీదుగా మెమొంటోలు మరియు ఇన్ స్పైర్ అవార్డుకు ఎంపికైన విద్యార్థిని మరియు ఉపాధ్యాయురాలిని డిఈవో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి, ఉపాధ్యాయులు రామకృష్ణ ,కృష్ణయ్య, శేఖర్ రమణా చారి ,విజయలక్ష్మి, పద్మ ,అనిల్ రావు ,మురళి తదితరులు పాల్గొన్నారు

## గ్రామపంచాయతీ అంగన్వాడీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్



**రామాయంపేట మార్చి 6 ( మన వార్త ప్రతినిధి )** రామాయంపేట మండలం వెంకటాపూర్(ఆర్ ) గ్రామంలో నిర్మించనున్న అంగన్వాడీ భవనం, గ్రామ పంచాయతీ భవనం పనులకు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ శంకుస్థాపన చేశారు. గ్రామపంచాయతీ, అంగన్వాడి సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించి వాటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ భవన నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేసేలా చూడాలని అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తుర్కపల్లి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం...



**-పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య..**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 06** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వేల్పుపల్లి , నాగాయపల్లి గ్రామలలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులలైన కూరేళ్ల పద్మ అశోక్ , ధారవత్ మౌనిక ప్రవీణ్ ఇరు కుటుంబ సభ్యులకు పట్టు బట్టలు పెట్టి మేక పొట్టేల్ ను బహుమతిగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని అన్నారు.ప్రతి పేద కుటుంబం గౌరవంగా సంతోషంగా జీవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు , నాయకులు , కార్యకర్తలు కాలనీ వాసులు తదితరుల పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రారంభం..



**జమ్మికుంట, మార్చి 06( మన వార్త ప్రతినిధి):**రాష్ట ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జమ్మికుంట పట్టణ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల లో ప్రిన్సిపాల్ డాక్టర్ బీ. రమేష్ శుక్రవారం ప్రారంభించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కళాశాల అవరణ లో ప్రత్యేక శ్రమదాన కార్యక్రమం చేపట్టారు.కళాశాల ఆవరణలోని చెత్త, చెదారం, పిచ్చిమొక్క లను తొలగించారు. అంతకు ముందు ప్రిన్సిపాల్ అధ్యాపకులతో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికపై కళాశాలలో చేపట్టాల్సిన పనుల గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కళాశాలలో చేయాల్సిన పలు పనుల కార్యచరణ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల ఆవరణలో పారిశుధ్యం, పెండింగ్ ఫైల్లు, మరమ్మతు పనులు పూర్తి చేయడానికి ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక మంచి కార్యక్రమం అని చెప్పారు. శ్రమదానం చేయడంలో విద్యార్థులు ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ - ప్రిన్సిపాల్ డాక్టర్ ఓదెలు కుమార్, డాక్టర్ గణేష్, డాక్టర్ రాజేంద్రం, రాజకుమార్ , కిరణ్ కుమార్, డాక్టర్ మాధవి, ఉమాకిరణ్ , డాక్టర్ రవి, రవిందర్, శ్రీనివాస్ రెడ్డి, మమత, డాక్టర్ రవి ప్రకాష్,డాక్టర్ సుష్మ, డాక్టర్ శ్రీనివాస్, స్వప్న, ప్రశాంత్, సాయి, అరుణ్ రాజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం రోజు మెగా ఉమేన్ హెల్త్ క్యాంప్..



**జమ్మికుంట, మార్చి 06( మన వార్త ప్రతినిధి):**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జమ్మికుంట పట్టణంలో రెనోవ బన్ను క్యాన్సర్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ తిరుపతి తెలిపారు. పట్టణంలోని స్థానిక డిగ్రీ కళాశాలలో ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హుజురాబాద్,జమ్మికుంట ఐఎంఏ ఆధ్వర్యంలో ఉచిత మెగా ఉమేన్ క్యాన్సర్ హెల్త్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఐ ఎం ఏ అధ్యక్షులు డాక్టర్ తిరుపతి తెలిపారు. జమ్మికుంట పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు గర్భాశయ ముఖ ద్వారం వద్ద సమస్యలు ఉన్న బ్రెస్ట్ క్యాన్సర్ కు సంబంధించిన లక్షణాలు ఉన్నా మహిళలకు ఈ మెగా క్యాన్సర్ వైద్య శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈసీజీ తో పాటు పలు పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల కేంద్రంలోని మహిళలందరూ సద్వినియోగం చేసుకొని క్యాంపును విజయవంతం చేయాలని కోరారు.

## ప్రగతి ప్రణాళిక తో వార్డులు సమగ్ర అభివృద్ధి చెందాలి..




**జమ్మికుంట, మార్చి 06( మన వార్త ప్రతినిధి):**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డులలో ఉన్న శానిటేషన్, ఎలెక్ట్రిషన్ వంటి సమస్యలను పరిష్కరించి పట్టణ అభివృద్ధి చేస్తామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ లు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ మొలుగు ప్రశాంత్, కమిషనర్ మహమ్మద్ అయాజ్, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ, మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, సిబ్బందితో పట్టణ ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొంటామని ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం చైర్మెన్ మొలుగు ప్రశాంత్, కమిషనర్ మహమ్మద్ అయాజ్ లు మాట్లాడుతూ ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వార్డులు రోజుకు మూడు వార్డుల చొప్పున 10రోజుల వ్యవధిలో 30 వార్డులలో ఉన్న శానిటేషన్, ఎలెక్ట్రిషన్ వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మార్చి 6 నుండి మార్చి 15వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వార్డుల్లో ఉన్న సమస్యలను ఒక ప్రణాళిక ప్రకారంగా చేసి పరిష్కరిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, టిపివో శ్రీధర్, ఏఈ వికాస్, టిపిఎస్ రాజ్ కుమార్, టిపిబివో దీపిక ,సీనియర్ అసిస్టెంట్ వాణి, భాస్కర్, శ్రీనివాస్ లతో పాటు అధికారులు, సిబ్బంది, మెప్మా అర్పిలు పలువురు పాల్గొన్నారు.

## మాజీ సీఎం కేసీఆర్ ను కలిసిన గడియారం స్వామి చారి



**గజ్వేల్ మార్చ్ 7 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ బి ఆర్ ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు గడియారం స్వామి చారి శుక్రవారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్ ను ఎఫ్ డి సి మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి తో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా గడియారం స్వామి చారి మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పీఠం బిఆర్ఎస్ కైవసం చేసుకోవడం కోసం కృషిచేసిన బి ఆర్ ఎస్ శ్రేణులకు అభినందనలు తెలిపారు అని రాబోయే రోజుల్లో మళ్ళీ బి ఆర్ ఎస్ రాష్ట్రంలో అధికారం చేపట్టడం జరుగుతుందని బి ఆర్ ఎస్ శ్రేణులకు ధైర్యంగా ఉండాలని,సూచించారని అన్నారు

## కవిత పాదయాత్రలో పాల్గొన్న కొట్టాల యాదగిరి ముదిరాజ్



**గజ్వేల్ మార్చ్ 7 మన వార్త ప్రతినిధి** లిక్కర్ కుంభకోణం కేసులో కవిత నిర్దోషిగా బయటపడగా, ఆమె అలిపిరి నుండి తిరుమల వరకు పాదయాత్రగా వెళ్లారు. అయితే కవిత పాదయాత్రలో గజ్వేల్ కు చెందిన హైకోర్టు న్యాయవాది, జాగృతి రాష్ట్ర వైస్ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్ పాల్గొన్నారు. తాము గతంలో కవిత లిక్కర్ కేసు నుండి నిర్దోషిగా బయటపడాలని తిరుమల శ్రీ వెంకటేశ్వరునికి మొక్కుకోగా, శుక్రవారం పాదయాత్రగా వెళ్లి ఆ మొక్కు చెల్లించుకున్నట్లు కొట్టాల యాదగిరి ముదిరాజ్ స్పష్టం చేశారు. జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత పై అక్రమ కేసు నమోదు చేసినప్పటికీ చివరకు ధర్మమే గెలిచిందని, అంతేకాకుండా కోర్టులపై సామాన్య ప్రజలకు సైతం నమ్మకం పెరిగిందని వివరించారు.

## మార్చి 8 నుండి జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్ పి వి వ్యాక్సిన్ అందుబాటులో..



**జమ్మికుంట, మార్చి 06( మన వార్త ప్రతినిధి):** జమ్మికుంట సామాజిక ఆరోగ్య కేంద్రంలో డిస్ట్రిక్ట్ ఇమ్మునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సాజిదా అతారి మరియు హుజురాబాద్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ చందు వైద్యాధికారులకు సిబ్బందికి హెచ్ పి వి వాక్సినేషన్ పై ఓరియంటేషన్ కం కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. హెచ్ పి వి వైరస్ ఇన్ఫెక్షన్ దీర్ఘకాలం కొనసాగడం వల్ల వచ్చే గర్భాశయ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నుంచి రక్షణ కల్పించే ప్రాథమిక నివారణ మందే 'హెచ్‌పీవీ వ్యాక్సిన్'. ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో వచ్చే క్యాన్సర్లలో గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ నాలుగో అత్యంత సాధారణ క్యాన్సర్. భారత్‌లో ఇది మహిళల్లో వచ్చే రెండో అత్యంత సాధారణ క్యాన్సర్‌గా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకారం ఈ వ్యాక్సిన్లు అవి లక్ష్యంగా చేసుకున్న హై-రిస్క్ హెచ్‌పీవీ రకాలను నివారించడంలో దాదాపు 100శాతం సమర్థవంతంగా పనిచేస్తాయి. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు యోని, వల్వర్, కొన్ని రకాల గొంతు క్యాన్సర్లు, జననేంద్రియ మొటిమలను నివారించడంలో కూడా ఈ వ్యాక్సిన్ తోడ్పడుతుందన్నారు.ఈనెల 8వ తేదీ నుండి జమ్మికుంట సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హెచ్ పి వి వ్యాక్సిన్ మూడు నెలల పాటు ప్రతిరోజు వేయడం జరుగుతుందని,14వ సంవత్సరం జన్మదినం జరుపుకున్న బాలికలు 15వ జన్మదినం చేసుకొనని బాలికలు ఈ వ్యాక్సిన్ వేసుకోవడానికి అర్హులని తెలిపారు.అర్హులైన బాలికలు తమ వెంట ఆధార్ కార్డు తీసుకొని వ్యాక్సిన్ వేసుకోగలరని ఈ వ్యాక్సిన్ 100శాతం సురక్షితమైనదని అర్హులైన బాలికలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ బి రమేష్, వైద్యాధికారులు డాక్టర్ వరుణ, డాక్టర్ తులసీదాస్,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం,డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాచారం గుట్ట లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా కేసీఆర్ కి ఆహ్వానం



**గజ్వేల్ మార్చ్ 7 మన వార్త ప్రతినిధి** బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం (నాచారం గుట్ట) ప్రతినిధులు శుక్రవారం నాడు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కలిశారు. గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కేసీఆర్ ని కలిసి, ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరు కావాల్సిందిగా కోరారు. నాచారం గుట్ట క్షేత్రంలో ఈ నెల 8వ తేదీ నుండి 19వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేయాలని కోరుతూ ఆలయ చైర్మన్ రవీందర్, కార్యనిర్వహణాధికారి (ఈఓ) రంగాచారి, అర్చక బృందం కేసీఆర్ కి అధికారికంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు కేసీఆర్ కి స్వామి వారి ప్రసాదాన్ని అందజేసి, వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనాలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులతో పాటు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మరోసారి తగ్గిన పసిడి ధరలు




**హైదరాబాద్** ఇటీవలి కాలంలో వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు తాజాగా కొంత తగ్గుముఖం పట్టడం కొనుగోలుదారులకు ఊరట కలిగిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో కూడా పసిడి ధరలు మార్పులకు లోనవుతున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మార్కెట్‌లో బంగారం ధరలు గణనీయంగా పడిపోవడంతో బంగారం కొనుగోలు చేయాలని ఎదురు చూస్తున్న వారికి ఇది కొంత అనుకూల పరిస్థితిగా మారింది. ముఖ్యంగా ఒకే రోజులో రెండోసారి ధరలు తగ్గడం మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది.నేటి మార్కెట్ పరిస్థితుల ప్రకారం 24 క్యారెట్ల బంగారం ధరలో గణనీయమైన తగ్గుదల కనిపించింది. పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ఒకే రోజులో సుమారు 1,750 రూపాయల వరకు తగ్గింది. దీంతో ప్రస్తుతం పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర సుమారు 1,61,130 రూపాయల వద్ద కొనసాగుతోంది. అదే విధంగా 22 క్యారెట్ల బంగారం ధర కూడా పడిపోయింది. పది గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరలో సుమారు 1,600 రూపాయల తగ్గుదల నమోదై ప్రస్తుతం 1,47,700 రూపాయల వద్ద కొనసాగుతోంది.బంగారం ధరలలో ఈ తరహా మార్పులకు అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, పెట్టుబడిదారుల ధోరణి, విదేశీ మార్కెట్‌లో డిమాండ్ వంటి అంశాలు ముఖ్య కారణాలుగా నిలుస్తాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ మార్కెట్‌లో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు ఎక్కువగా మొగ్గు చూపినప్పుడు బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా పెరగడం సాధారణమే. అయితే కొన్ని సందర్భాల్లో అమ్మకాల ఒత్తిడి పెరిగితే ధరలు తగ్గే అవకాశమూ ఉంటుందని వారు వివరిస్తున్నారు.ఇటీవలి నెలల్లో గ్లోబల్ మార్కెట్ ప్రభావంతో బంగారం ధరలు భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం ఆ పెరుగుదల తర్వాత కొంత సర్దుబాటు జరుగుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో కొంతకాలంగా కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న వినియోగదారులు ఇప్పుడు మార్కెట్‌ను దగ్గరగా గమనిస్తున్నారు. ధరలు ఇంకా తగ్గుతాయా లేదా మళ్లీ పెరుగుతాయా అన్నదానిపై పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**హైదరాబాద్** అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు దేశీయ షేర్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో పెట్టుబడిదారులు ఆందోళనకు గురయ్యారు. దీనివల్ల దేశీయ మార్కెట్లలో భారీ అమ్మకాలు చోటుచేసుకుని సూచీలు తీవ్రంగా పడిపోయాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ ఒక్కరోజులోనే 1097 పాయింట్లు కోల్పోయింది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 78,918 వద్ద, నిఫ్టీ 24,450 వద్ద స్థిరపడ్డాయి.ఇరాన్ బహ్రెయిన్‌లోని చమురు శుద్ధి కేంద్రంపై దాడులు చేయడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ చమురు ధర బ్యారెల్‌కు 86 డాలర్లకు చేరడంతో భారత రూపాయి విలువపై ఒత్తిడి పెరిగింది. ఫలితంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 91.84 స్థాయికి పడిపోయింది. మార్కెట్లో అనిశ్చితిని సూచించే సూచీ కూడా సుమారు 11 శాతం పెరిగినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.ఈ పతనంలో ముఖ్యంగా బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్ రంగాలకు చెందిన షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ 2 శాతం కంటే ఎక్కువ పడిపోయి 57,783 వద్దకు చేరింది. పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరించడం వల్ల అనేక రంగాల్లో అమ్మకాలు పెరిగినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.అయితే యుద్ధ వాతావరణం కారణంగా రక్షణ రంగానికి చెందిన సంస్థల షేర్లకు మాత్రం డిమాండ్ పెరిగింది. ప్రభుత్వ రంగ రక్షణ సంస్థల షేర్లు దాదాపు 9 శాతం వరకు లాభపడినట్లు మార్కెట్ సమాచారం చెబుతోంది. దీంతో భారీ నష్టాల మధ్య కూడా పెట్టుబడిదారులకు కొంత మేర ఊరటనిచ్చినట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## విమానం రద్దు లేదా ఆలస్యమైతే బీమా సొమ్ము వస్తుందా..?



**హైదరాబాద్** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయంగా విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు చేపట్టడం, అదే సమయంలో పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు చేయడం వల్ల ఆ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితుల ప్రభావంతో అనేక అంతర్జాతీయ విమానాలు రద్దు అవుతుండగా, మరికొన్ని విమానాలను ఇతర మార్గాలకు మళ్లిస్తున్నారు. హైదరాబాద్ సహా దేశంలోని పలు నగరాల నుంచి బయలుదేరే కొన్ని విమానాలు కూడా రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో విమానం రద్దు అయితే లేదా ఆలస్యమైతే ట్రావెల్ బీమా వర్తిస్తుందా అనే సందేహం చాలామందిలో వ్యక్తమవుతోంది.నిపుణుల ప్రకారం, విమానం ఆలస్యం లేదా రద్దు అయిన ప్రతిసారి ఆటోమేటిక్‌గా బీమా పరిధిలోకి వస్తుందని అనుకోవడం సరైంది కాదని చెబుతున్నారు. ప్రయాణ బీమా పాలసీ నిబంధనలు, అలాగే అంతరాయం ఏర్పడిన కారణం ఆధారంగా మాత్రమే పరిహారం లభిస్తుంది. ఉదాహరణకు తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, విమాన సిబ్బంది సమ్మెలు, విమానంలో సాంకేతిక లోపాలు వంటి కారణాల వల్ల విమానం ఆలస్యం అయినా లేదా రద్దయినా కొన్ని పాలసీలలో బీమా వర్తించే అవకాశం ఉంటుంది. అయితే యుద్ధ పరిస్థితులు, భద్రతా సమస్యలు వంటి అంశాలు కొన్ని పాలసీలలో మినహాయింపుగా కూడా ఉండొచ్చు. అందువల్ల ప్రయాణికులు తమ బీమా పాలసీ నిబంధనలను ముందుగానే తెలుసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.కొన్ని ట్రావెల్ బీమా పాలసీలు అదనపు ప్రయోజనాలను కూడా అందిస్తున్నాయి. ఉదాహరణకు విమానం ఎక్కువసేపు ఆలస్యం అయితే ప్రయాణికులకు పరిహారం చెల్లించడం, ప్రయాణాన్ని మళ్లీ షెడ్యూల్ చేసుకునే అవకాశం ఇవ్వడం, ఆలస్యంతో రాత్రి బస అవసరమైతే హోటల్ ఖర్చులను కూడా భరిస్తాయి. కొన్ని సందర్భాల్లో భోజనం, రవాణా వంటి ఖర్చులకు కూడా పరిమిత పరిహారం అందించే అవకాశముంది. అయితే ఇవన్నీ పాలసీ వివరాలు, తీసుకున్న బీమా రకం ఆధారంగా మారుతాయి.అందువల్ల విమాన ప్రయాణం చేయడానికి ముందు ట్రావెల్ బీమా తీసుకునే సమయంలో అందులో ఏ అంశాలు కవర్ అవుతాయి, ఏవి కవర్ కావు అనే విషయాలను జాగ్రత్తగా పరిశీలించడం అవసరం. అలాగే క్లెయిమ్ దాఖలు చేయడానికి అవసరమైన పత్రాలు, నిబంధనలు ఏమిటి అనే విషయాలను కూడా ముందుగానే తెలుసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా ముందస్తు అవగాహనతో ప్రయాణం చేస్తే చివరి నిమిషంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించుకోవచ్చని చెబుతున్నారు.

మన వార్త

శనివారం 07 మార్చి 2026

MANA VAARTHA



# అడివి శేష్ రాహుల్ రవీంద్రన్ కొత్త చిత్రం చర్చలు



**హైదరాబాద్** టాలీవుడ్‌లో కథల ఎంపికలో ఎంతో జాగ్రత్తగా ఉండే హీరోగా గుర్తింపు పొందిన అడివి శేష్ తన సినీ ప్రయాణాన్ని ఎంతో ప్రణాళికాబద్ధంగా కొనసాగిస్తున్నాడు. బలమైన కథ, ఆసక్తికరమైన స్క్రీన్‌ప్లే ఉంటేనే సినిమా చేయాలనే విధానాన్ని పాటిస్తూ వస్తున్న ఆయన నటించిన చిత్రాలు ఎక్కువగా ప్రేక్షకాదరణతో పాటు వాణిజ్యపరంగానూ మంచి విజయాలు సాధిస్తున్నాయి. కథకు ప్రాధాన్యం ఇచ్చే నటుడిగా పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అడివి శేష్ ప్రస్తుతం కూడా కొన్ని ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఆయన తదుపరి ప్రాజెక్టులపై సినీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చలు కొనసాగుతున్నాయి.ప్రస్తుతం అడివి శేష్ చేతిలో ఉన్న ముఖ్యమైన చిత్రాల్లో “డెకాయిట్” మరియు “గూఢచారి 2” ప్రధానంగా నిలుస్తున్నాయి. ఈ రెండు సినిమాలపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా గతంలో వచ్చిన “గూఢచారి” చిత్రం భారీ విజయాన్ని సాధించడంతో ఇప్పుడు వస్తున్న “గూఢచారి 2”పై అభిమానులు మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం కథ, నిర్మాణ విలువలు మరింత విస్తృతంగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో అడివి శేష్ తన సమయాన్ని ఎక్కువగా ఈ ప్రాజెక్టులకే కేటాయిస్తున్నట్లు సమాచారం.ఇదిలా ఉండగా తాజాగా మరో ఆసక్తికరమైన విషయ టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ఇటీవల అడివి శేష్‌కు ఒక కొత్త కథను వినిపించినట్లు తెలుస్తోంది. ఆ కథ శేష్‌కు బాగా నచ్చినట్లు కూడా సమాచారం. అయితే ఇప్పటికే ఉన్న సినిమా కమిట్‌మెంట్స్ కారణంగా వెంటనే ఆ ప్రాజెక్ట్‌కు తేదీలు కేటాయించడం ఆయనకు సాధ్యపడకపోవచ్చని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న చిత్రాల షూటింగ్ పూర్తి అయిన తర్వాత మాత్రమే ఈ కొత్త ప్రాజెక్ట్‌పై ముందుకు వెళ్లే అవకాశం ఉందని సమాచారం.దర్శకుడు రాహుల్ రవీంద్రన్ కూడా తనదైన శైలిలో సినిమాలు తెరకెక్కిస్తూ దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. ఆయన దర్శకత్వంలో వచ్చిన “చి ల సౌ” చిత్రం మంచి విజయాన్ని సాధించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అనంతరం “మన్మథుడు 2” చిత్రానికి దర్శకత్వం వహించాడు. ఇటీవల ఆయన రూపొందించిన “ది గర్ల్‌ఫ్రెండ్” చిత్రం కూడా విమర్శకుల ప్రశంసలను అందుకుంది. విభిన్న కథలను ఎంచుకుంటూ తనదైన ముద్ర వేస్తున్న దర్శకుడిగా రాహుల్ రవీంద్రన్ నిలుస్తున్నాడు.ప్రస్తుతం రాహుల్ రవీంద్రన్ రెండు కొత్త కథలను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. అందులో ఒక కథను అడివి శేష్‌కు వినిపించగా, అది ఆయనకు నచ్చినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే శేష్ తన ప్రస్తుత సినిమాలు పూర్తి చేసిన తర్వాతే ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. ఇదే సమయంలో రాహుల్ రవీంద్రన్ మరోవైపు యువ హీరో దీక్షిత్ శెట్టితో ఒక కొత్త సినిమాను ప్రారంభించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ ఏడాదిలోనే ఆ సినిమా చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.అడివి శేష్ ప్రస్తుతం చేస్తున్న ప్రాజెక్టులు పూర్తయ్యేలోపు ఆ సినిమాను పూర్తి చేయాలని దర్శకుడు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాడని సినీ వర్గాలు చెబుతున్నాయి. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే రాహుల్ రవీంద్రన్ [illegible] అడివి శేష్ కాంబినేషన్‌లో ఒక విభిన్నమైన కథతో కొత్త సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడలేదు. అయినప్పటికీ ఈ ఆసక్తికరమైన కాంబినేషన్‌పై ఇప్పటికే సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# ‘మృత్యుంజయ్’ రివ్యూ శ్రీవిష్ణు కొత్త సినిమా ఎలా ఉంది.!




**హైదరాబాద్** టాలీవుడ్‌లో విభిన్న కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటుడు శ్రీవిష్ణు తాజాగా మరో కొత్త చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. గత వారం విడుదలైన ‘విష్ణు విన్యాసం’తో వినోదాన్ని పంచిన ఆయన, ఈసారి పూర్తి భిన్నమైన శైలిలో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ‘మృత్యుంజయ్’ చిత్రంతో థియేటర్లలో అడుగుపెట్టాడు. హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో రెబా మోనికా జాన్ కథానాయికగా నటించింది. ఆసక్తికరమైన కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుందో ఇప్పుడు చూద్దాం.ఈ చిత్ర కథ జయ్ అనే యువకుడి చుట్టూ తిరుగుతుంది. జయ్ ఒక వార్తా సంస్థలో పని చేసే రిపోర్టర్. క్రైమ్ విభాగంలో పనిచేయాలని అతని కల అయినప్పటికీ, ప్రస్తుతం ప్రకటనల విభాగంలో పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. మరణించిన వ్యక్తుల కుటుంబాలను కలుసుకుని వారి జీవిత విశేషాలను సేకరించి శ్రద్ధాంజలి ప్రకటనలు ప్రచురించడం అతని పని. ఈ క్రమంలో అచ్యుత్ రావు అనే వ్యక్తి మరణం జయ్‌ను తీవ్రంగా కలిచివేస్తుంది. ఆ మరణం వెనుక అసలు నిజం తెలుసుకోవాలని అచ్యుత్ కూతురు అంజలి కోరడంతో జయ్ దాని గురించి అన్వేషణ ప్రారంభిస్తాడు. మొదట సాధారణ మరణాల్లా కనిపించిన కొన్ని ఘటనలు నిజానికి పక్కా ప్రణాళికతో జరిగే హత్యలని అతడు గుర్తిస్తాడు. ఈ కేసును విచారిస్తున్న ఐపీఎస్ అధికారి సీతతో కలిసి జయ్ ఆ హంతకుడి వెనుక ఉన్న నిజాన్ని ఎలా బయటపెట్టాడు? ఆ హంతకుడి అసలు ఉద్దేశం ఏమిటి? అనే అంశాల చుట్టూ కథ ముందుకు సాగుతుంది.దర్శకుడు హుస్సేన్ షా కిరణ్ ఈ చిత్రాన్ని సాధారణ క్రైమ్ కథలా కాకుండా మానసిక ఆటలతో నిండిన థ్రిల్లర్‌గా తెరకెక్కించాడు. ప్రారంభ భాగంలో పాత్రల పరిచయం, కథానాయకుడు చేసే వింతైన ఉద్యోగం ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగిస్తాయి. అయితే కథ అసలు దిశలోకి వెళ్లడానికి కొంత సమయం తీసుకుంటుంది. ద్వితీయార్ధంలో కథ వేగం పెరిగి ఉత్కంఠ మరింతగా పెరుగుతుంది. హీరో, ప్రతినాయకుడి మధ్య జరిగే మైండ్ గేమ్, ఒకరి ఎత్తులకు మరొకరు ప్రతిఎత్తులు వేయడం వంటి సన్నివేశాలు సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయి. ముఖ్యంగా క్లైమాక్స్ వరకు సస్పెన్స్‌ను కొనసాగించడంలో దర్శకుడు సఫలమయ్యాడు.నటీనటుల విషయానికి వస్తే శ్రీవిష్ణు తనకు అలవాటైన వినోదాత్మక పాత్రలకు భిన్నంగా చాలా సీరియస్ పాత్రలో కనిపించాడు. అతని నటనలోని నెమ్మదైన భావోద్వేగాలు, సంభాషణల తీరు పాత్రకు తగ్గట్టుగా ఉన్నాయి. కథానాయికగా నటించిన రెబా మోనికా జాన్ ఒక బాధ్యతాయుతమైన పోలీస్ అధికారి పాత్రలో మెప్పించింది. ప్రతినాయకుడిగా నటించిన వీర్ ఆర్యన్ తన పాత్రలో గంభీరతను చూపించి కొన్ని సన్నివేశాల్లో భయానక వాతావరణాన్ని సృష్టించాడు. సహాయ పాత్రల్లో కనిపించిన బాలాదిత్య, సుదర్శన్, రచ్చ రవి తమ తమ పాత్రలకు న్యాయం చేశారు.సాంకేతిక అంశాల విషయానికి వస్తే కాలభైరవ అందించిన నేపథ్య సంగీతం సినిమాకు పెద్ద బలంగా నిలిచింది. ముఖ్యంగా థ్రిల్లర్ సన్నివేశాల్లో సంగీతం ఉత్కంఠను మరింత పెంచింది. ఎడిటింగ్ కూడా కథను గట్టిగా పట్టుకునేలా ఉంది. సినిమాటోగ్రఫీ కథకు తగిన మూడ్‌ను సృష్టించడంలో సహాయపడింది.మొత్తంగా చూస్తే ‘మృత్యుంజయ్’ ఒక ఆసక్తికరమైన అన్వేషణాత్మక థ్రిల్లర్‌గా నిలుస్తుంది. మొదటి భాగంలో కథనం కొద్దిగా నెమ్మదిగా సాగినప్పటికీ, ద్వితీయార్ధంలో వచ్చే మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి. కమర్షియల్ హంగుల కంటే కథపైనే దృష్టి పెట్టిన ఈ చిత్రం థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ వారాంతంలో ఒక మంచి ఎంపికగా నిలిచే అవకాశం ఉంది.

# ఇంగ్లాండ్ ఆటతీరు చూసి

## ఆశ్చర్యపోయా: సూర్యకుమార్ యాదవ్




**హైదరాబాద్** ఇరవై ఓవర్ల ప్రపంచకప్ సెమీఫైనల్ పోటీలో ఇంగ్లాండ్‌పై భారత్ ఉత్కంఠభరిత విజయాన్ని నమోదు చేసి ఫైనల్‌కు దూసుకెళ్లిన నేపథ్యంలో భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పందించారు. ఈ మ్యాచ్ ఎంతో ఉత్కంఠగా సాగిందని, ఇంగ్లాండ్ జట్టు ప్రదర్శన చూసి తాను నిజంగానే ఆశ్చర్యపోయానని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో జరుగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లో జట్టుకు నాయకత్వం వహిస్తూ ఫైనల్‌కు చేరుకోవడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతిగా ఉందని చెప్పారు. దేశం ముందే ఆడుతూ జట్టును విజయపథంలో నడిపించడం గర్వకారణమని, ఈ విజయం మొత్తం జట్టు సమిష్టి కృషి ఫలితమని ఆయన వెల్లడించారు.ఇంగ్లాండ్ లక్ష్య ఛేదనలో చివరి వరకు మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగిందని, ఆ సమయంలో తనకు కూడా తీవ్ర ఒత్తిడి అనిపించిందని సూర్యకుమార్ యాదవ్ తెలిపారు. ఎవరైనా ఆ సమయంలో తన గుండె స్పందనను కొలిచివుంటే అది చాలా ఎక్కువగా ఉండేదని సరదాగా వ్యాఖ్యానించారు. అయినప్పటికీ బౌలర్లు అద్భుతంగా రాణించి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పారని చెప్పారు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ కీలక సమయాల్లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థి పరుగుల ప్రవాహాన్ని అడ్డుకున్నారని ఆయన కొనియాడారు. బుమ్రా ఎన్నేళ్లుగా భారత జట్టుకు ఎంత గొప్ప సేవ చేస్తున్నాడో అందరికీ తెలిసిందేనని, ఈ మ్యాచ్‌లో కూడా అతడు అదే స్థాయి ప్రదర్శన చూపాడని తెలిపారు.మ్యాచ్‌కు ముందు నుంచే స్టేడియం అభిమానులతో నిండిపోయిందని, భారత్ గెలవాలని ప్రేక్షకులు ఎంతగా కోరుకుంటున్నారో అప్పుడు స్పష్టంగా కనిపించిందని సూర్యకుమార్ యాదవ్ అన్నారు. దేశంలో ఫైనల్ ఆడటం ఒకవైపు ఆనందం కలిగిస్తూనే మరోవైపు ఒత్తిడిని కూడా పెంచుతుందని పేర్కొన్నారు. అయినప్పటికీ ఆటగాళ్లు, సహాయక సిబ్బంది అందరూ ఎంతో ఉత్సాహంగా ఉన్నారని, అభిమానులకు మరొక గొప్ప పోరును అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఫైనల్ మ్యాచ్‌లో కూడా ఇదే పోరాటస్ఫూర్తితో ఆడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# న్యూజిలాండ్‌తో పోరు అంత సులభం కాదు



**హైదరాబాద్** ఇరవై ఓవర్ల ప్రపంచకప్ తుది పోరుకు రంగం సిద్ధమైంది. ఆదివారం జరగనున్న ఈ కీలక పోటీలో భారత్, న్యూజిలాండ్ జట్లు కప్పు కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ రెండు జట్లు ఫైనల్‌లో తలపడుతుండటంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. అయితే ప్రపంచకప్ చరిత్రలో ఇరు జట్ల మధ్య జరిగిన పోటీల గణాంకాలను పరిశీలిస్తే న్యూజిలాండ్ జట్టుకు కొంత ఆధిపత్యం ఉన్నట్టు కనిపిస్తోంది. గతంలో మెగా టోర్నీల్లో ఎదురుపడిన సందర్భాల్లో న్యూజిలాండ్ జట్టు విజయం సాధించడం భారత అభిమానుల్లో కొంత ఆందోళన కలిగిస్తోంది. అయినప్పటికీ ప్రస్తుత భారత జట్టు అద్భుతమైన ఫామ్‌లో ఉ ఒడటంతో ఈసారి పరిస్థితి భిన్నంగా ఉండొచ్చనే ఆశాభావం వ్యక్తమవుతోంది.ప్రస్తుత న్యూజిలాండ్ జట్టు బ్యాటింగ్ విభాగం చాలా బలంగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఓపెనర్లు ఫిన్ అలెన్, టిమ్ సీఫర్ట్ దూకుడైన ఆటతో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి తెస్తున్నారు. వీరికి తోడు రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్‌మన్, డారిల్ మిచెల్ వంటి ఆటగాళ్లు జట్టులో ఉండటంతో కివీస్ బ్యాటింగ్ శక్తి మరింత పెరిగింది. వీరిలో ప్రతి ఒక్కరూ ఎప్పుడైనా మ్యాచ్ గమనాన్ని మార్చగల సామర్థ్యం కలిగినవారే. అందువల్ల వీరిని నియంత్రించడం భారత బౌలర్లకు పెద్ద సవాలుగా మారనుంది.గత గణాంకాలు ఏం చెబుతున్నాయన్నది పక్కన పెట్టి ఫైనల్ పోరులో కొత్త చరిత్ర రాయాలనే సంకల్పంతో భారత జట్టు బరిలోకి దిగుతోంది. వ్యూహాత్మక ప్రణాళికలు, సమిష్టి ప్రదర్శనతో ఆడితే న్యూజిలాండ్ సవాల్‌ను భారత్ అధిగమించగలదని అభిమానులు ఆశిస్తున్నారు. సొంత గడ్డపై జరిగే ఈ తుది పోరులో విజయం సాధించి ప్రపంచకప్ కప్పును మరోసారి ఎత్తాలని భారత జట్టు దృఢ సంకల్పంతో సిద్ధమవుతోంది.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com